

యువతలేని పోరు..!

వైసీపీ ఆందోళనకు శ్రేణులు దూరం

విద్యార్థుల కోసం ఎస్ఎస్‌బీఎన్ వద్ద వాగ్వాదం

ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి ఇవ్వాలి

వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి


నగరంలో ర్యాలీ

అనంతపురం క్రైం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ చేపట్టిన యువత పోరులో యువత పెద్దగా కనిపించలేదు. వైసీపీ నాయకులకే కాలేజీలు ఉన్నా.. విద్యార్థులు కూడా రాలేదు. విద్యార్థి, యువత సమస్యలపై పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంతవెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో నగరంలో 'యువత పోరు' పేరిట కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద అనంత వెంకటరామిరెడ్డి ప్రసంగించారు. రాష్ట్రవ్యాప్తంగా 11 లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అనంత అన్నారు. ప్రభుత్వం చెల్లించకపోవడంతో అప్పులు చేసి ఫీజు కడుతున్నారని అన్నారు. యువతకు ఇచ్చిన హామీలను కూడా ఈ ప్రభుత్వం అమలు చేయడం లేదని విమర్శించారు. నిరుద్యోగ భృతికి బడ్జెట్ కేటాయించలేదని అన్నారు. వైసీపీ హయాంలో 17 మెడికల్ కళాశాలలకు శ్రీకారం చుట్టామని, అందులో ప్రారంభించిన ఐదు కాలేజీలను ఈ ప్రభుత్వం ప్రైవేటీకరిస్తోందని ఆరోపించారు. మెడికల్ కళాశాలలను ప్రభుత్వ ఆధీనంలోనే నడపాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు మంగమ్మ, శివరామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాలేజీలో రాజకీయాలా..?

వైసీపీ ర్యాలీ జరిగే సమయంలో ఎస్ఎస్‌బీఎన్ కళాశాల వద్ద వాగ్వాదం జరిగింది. విద్యార్థులను పంపేందుకు ప్రిన్సిపాల్ నిరాకరించడంతో 'కూటమి ప్రభుత్వానికి మద్దతు పలుకుతున్నారా..?' అని వైసీపీ నాయకులు ప్రశ్నించారు. తమకు రాజకీయాలు అవసరం లేదని, పిల్లలు ఇబ్బంది పడతారని ప్రిన్సిపాల్ వారితో అన్నారు. విద్యార్థులను ఇబ్బంది పెట్టవద్దని, బయటకెళ్లాలని టూటౌన్ సీఐ శ్రీకాంత్ సూచించారు. ర్యాలీలు బయట చేసుకోవాలని, కళాశాలలో కాదని సీఐ స్పష్టం చేయడంతో వెనుదిరిగారు.

గుంపులో గోవింద

ఐదేళ్లు అధికారం అనుభవించిన వైసీపీ నేతలు యువత పోరులో గుంపులో గోవింద అన్నట్లు వ్యవహరించారు. ముఖ్య నాయకులు వచ్చినా, శ్రేణులను రప్పించలేదు. మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఇప్పటివరకు పార్టీ కార్యక్రమాల్లో ఒక్కసారీ పాల్గొనలేదు. యువత పోరుకూ డుమ్మా కొట్టారు. ఆమె భర్త సాంబశివారెడ్డి తన కాలేజీ నుంచి కూడా విద్యార్థులను పిలిపించలేదు. పార్టీ నాయకులు అడిగితే.. 'కుదరలేదు..' అని చెప్పారట. కళాశాలల్లో భాగస్వామ్యం ఉన్న మరో ఇద్దరు నేతలు సైతం సరిగా స్పందించలేదని తెలిసింది. గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి జెడ్పీ కార్యాలయం వద్ద విగ్రహాలకు నివాళులు అర్పించాక.. అక్కడే ఉండిపోయారు. ర్యాలీ ముగిశాక కలెక్టరేట్‌కు వెళ్లారు. కళ్యాణదుర్గం, ఉరవకొండ, గుంతకల్లు, తాడిపత్రి ప్రాంతాల నుంచి పార్టీ శ్రేణులు పెద్దగా రాలేదు. శింగనమల, రాయదుర్గం ప్రాంతాల నుంచి కొంతవరకు వచ్చారు.

ట్రాఫిక్ జామ్

వైసీపీ యువత పోరు కారణంగా నగరంలో ట్రాఫిక్ జామ్ అయ్యింది. జెడ్పీ కార్యాలయం, సూర్యానగర్, అశోక్ నగర్ వాహనదారులు ఇబ్బంది పడ్డారు. ఇంటర్ విద్యార్థులను తీసుకెళ్లే బస్సులు నిలిచిపోవడంతో సాయినగర్, సప్తగిరి సర్కిల్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది.


టూటౌన్ సీఐతో వైసీపీ నాయకుల వాగ్వాదం

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి నిధులివ్వండి

అసెంబ్లీలో ఎమ్మెల్యే దగ్గుపాటి



అనంతపురం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి నిధులు ఇవ్వాలని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో బుధవారం ఆయన మాట్లాడారు. 'మీ ఇంటికి-మీ ఎమ్మెల్యే' కార్యక్రమం ద్వారా అనంతపురంలోని కాలనీల్లోకి తాను వెళుతుంటే డ్రైనేజీ సమస్యలు అత్యధికంగా తన దృష్టికి తెస్తున్నారని అన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ద్వారానే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని అన్నారు. ఇప్పటికే డీపీఆర్ సిద్ధం చేశారని, ఈ బడ్జెట్ నుంచి నిధులు కేటాయించి నిర్మించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. వైసీపీ పాలనలో అనేక అక్రమాలకు పాల్పడ్డారని అన్నారు. అప్పటి అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి డమ్మీ మేయర్ వసీంను అడ్డుపెట్టుకొని భారీ అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. దీనిపై విచారణ చేసి డబ్బు రికవరీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ బడ్జెట్ నుంచే అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి నిధులు కేటాయించి, సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని మంత్రి నారాయణ హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి తెలిపారు.

దోపిడీకి వెళ్లిన అన్నదమ్ములు..?

చిత్తూరు ఘటనలో ముగ్గురు జిల్లావాసులు

వివరాలు మెయిన్‌లో..

రీ వెరిఫికేషన్‌లో మాయగాళ్లు..!

.... డాక్టర్లకు నకిలీల మస్కా ....

బయట ఒకరు బయోమెట్రిక్.. లోపలికి మరొకరు హాజరు

ఆర్థో పరీక్షల్లో నకిలీవ్యక్తి గుర్తింపు.. పరుగులు

డీసీహెచ్ఎస్‌కు డాక్టర్ల ఫిర్యాదు



అనంతపురం టౌన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో నకిలీ ధ్రువ పత్రాలతో దివ్యాంగుల పింఛన్లు తీసుకుంటున్న మోసగాళ్ల ఆటలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. నకిలీ పింఛన్లకు వైసీపీ ప్రభుత్వ హయాంలో అడ్డూ అదుపు లేకుండా పోయింది. తమపార్టీ వారని అప్పటి ప్రజాప్రతినిధులు ఒత్తిడి చేయడంతో డాక్టర్లు ధ్రువపత్రాలు ఇచ్చేశారు. ఇదే అదనుగా కొందరు దళారీలు డాక్టర్లను బుట్టలోకి వేసుకొని డబ్బులిచ్చి నకిలీ వైకల్య ధ్రువపత్రాలను విచ్చలవిడిగా చేయించుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛన్ల సొమ్ము పెంచారు. ఇదే సమయంలో అర్హులకు మాత్రమే పింఛన్లు అందాలని, నకిలీలను ఏరివేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశించారు. దీంతో దివ్యాంగుల వైకల్య సర్టిఫికెట్ల రీవెరిఫికేషన్‌కు శ్రీకారం చుట్టారు. ఈ ప్రక్రియకు జిల్లా డాక్టర్లతో కాకుండా ఇతర జిల్లాల డాక్టర్లను నియమించారు. ఇప్పటికే రూ.15 వేలు పింఛన్ తీసుకుంటున్న లబ్ధిదారుల రీవెరిఫికేషన్ పూర్తిచేశారు. ప్రస్తుతం రూ.6వేలు పింఛన్లు తీసుకుంటున్న లబ్ధిదారుల వైకల్య సర్టిఫికెట్లను రీవెరిఫికేషన్ చేస్తున్నారు. జిల్లా సర్వజన ఆసుపత్రిలో ఇది కొనసాగుతోంది.

● ఈ మాయ ఎవరిది..?

నకిలీ వైకల్య సర్టిఫికెట్లను ఏరివేయాలని ప్రభుత్వం పగడ్బందీగా రీవెరిఫికేషన్ కొనసాగిస్తోంది. ఇపుడు నకిలీలు అధికారులు, డాక్టర్లను మస్కా కొట్టించడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎంతటివారైనా రీవెరిఫికేషన్‌లో విధులు నిర్వర్తిన్న వారి అండదండలు ఉంటేనే ఇలాంటి వ్యవహారాలు సాధ్యమవుతాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే కళ్యాణదుర్గం ప్రాంతంలోని ఓ పీహెచ్‌సీలో పనిచేస్తున్న డాక్టర్ తనకు రూ.20 వేలు ఇస్తే వైకల్య సర్టిఫికెట్లను రీవెరిఫికేషన్‌లో ఓకే చేయిస్తానని వ్యాపారం చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆసుపత్రిలో పనిచేస్తున్న కొందరు సిబ్బంది, దళారులు, డీఆర్‌డీఏ ఉద్యోగులు కుమ్మక్కై ఈ అక్రమాలకు తెరలేపారన్న విమర్శలు ఉన్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే మోసగాళ్లు రెచ్చిపోతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

● బయట ఒకరు.. లోపలికి మరొకరు..

నకిలీ వైకల్య సర్టిఫికెట్లతో పింఛన్ తీసుకుంటున్న వారు అడ్డదారులు తొక్కుతున్నారు. ఎవరి ఊహలకూ అందని మాయచేస్తూ వెరిఫికేషన్‌కు వచ్చిన డాక్టర్లను తికమక పట్టిస్తున్నారు. రీవెరిఫికేషన్ సెంటర్‌కు వచ్చిన దివ్యాంగులను బయటే బయోమెట్రిక్ తీసుకొని లోపలికి పంపుతున్నారు. బయోమెట్రిక్ వేసిన తర్వాత అతడి స్థానంలో వైకల్యం ఉన్న మరొకరు లోపలికి వెళ్లికూర్చుంటున్నారు. డాక్టరు వద్దకు ఒరిజనల్ దివ్యాంగులు పోతుండడంతో పరిశీలించి వైకల్యం ఉందని ఆమోదం తెలిపి పంపుతున్నారు. ఇలా మాయగాళ్లు డాక్టర్లను మోసం చేస్తున్నారని బుధవారం డీసీహెచ్‌కు ఓ డాక్టర్ ఫిర్యాదు చేయడంతో వెలుగులోకివచ్చింది. ఓ వ్యక్తి పీహెచ్ కింద డాక్టర్ వద్దకు వెళ్లాడు. డాక్టరు ఆయనను పరీక్షిస్తుండగా వయసు 36 ఏళ్లు ఉండాలి కానీ ఎక్కువ ఉన్నట్లు అనుమానం వచ్చింది. ఆధార్, వైకల్య సర్టిఫికెట్ అడగడంతో అక్కడి నుంచి వేగంగా తప్పించుకుని వెళ్లిపోయాడు. వారం క్రితం కూడా అంధత్వ వైకల్య రీవెరిఫికేషన్‌లోనూ ఇలాగే ఇద్దరు.. బయట ఒకరు బయోమెట్రిక్‌వేసి లోపలికి ఇంకొకరు వెళ్లి ఆమోదం వేయించుకున్నట్లు డీసీహెచ్‌కు ఫిర్యాదులు వచ్చాయి.

● మోసాలపై ఫిర్యాదులు వాస్తవమే



వైకల్య సర్టిఫికెట్ల రీవెరిఫికేషన్‌లో కొందరు చేస్తున్న మోసాలపై ఫిర్యాదులు వచ్చిన మాట వాస్తవమే. బయట బయోమెట్రిక్ ఒకరు వేసి లోపలికి మాత్రం వైకల్యం ఉన్న వారు వెళ్లి డాక్టరుతో ఆమోదం వేయించుకుంటున్నారు. వారం క్రితం అంధత్వ సర్టిఫికెట్ల రీవెరిఫికేషన్‌లో ఇద్దరు ఇలాగే చేశారని ఫిర్యాదు రావడంతో విచారణ చేయిస్తున్నాం. తాజాగా బుధవారం ఆర్థో(పీహెచ్) వైకల్య సర్టిఫికెట్ రీవెరిఫికేషన్‌కు బయట బయోమెట్రిక్ వేసి లోపలికి ఇంకొకరు వెళ్లారు. డాక్టర్‌కు వయసుపై అనుమానం వచ్చి అడగడంతో తప్పించుకొని వెళ్లాడు. రాష్ట్ర అధికారుల దృష్టికి తీసికెళ్లాను. డాక్టర్ వద్ద కూడా బయోమెట్రిక్ తీసుకోవాలని చెప్పారు. ఆధారాలతో ఫిర్యాదు చేస్తే ఎవరి పాత్ర ఉన్నా కఠిన చర్యలు తీసుకుంటాం.

-డాక్టర్ రవికుమార్, డీసీహెచ్ఎస్

48 కొత్త బస్సులకు ప్రతిపాదనలు: ఆర్టీసీ ఆర్ఎం

ఉరవకొండ, మార్చి12(ఆంధ్రజ్యోతి): జిల్లాకు 48 కొత్త బస్సులకు ప్రతిపాదనలు పంపినట్లు ఆర్టీసీ ఆర్ఎం సుమంత్ ఆర్ ఆదోని తెలిపారు. స్థానిక ఆర్టీసీ డిపోని ఆయన బుధవారం తనిఖీ చేశారు. బస్టాండు ఆవరణలోని కార్గో పార్శిల్ సర్వీసు కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం డిపోలోని గ్యారేజీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాత బస్సుల స్థానంలో 98 కొత్తవి వచ్చాయన్నారు. రద్దీ ఉన్న రూట్లలో బస్సులను పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ హంపన్న, ఎస్టీఐ రమణమ్మ పాల్గొన్నారు.

భూ దోపిడీపై చర్యలు తీసుకోండి

ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ



శింగనమల, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో భూ కబ్జాలు, దౌర్జన్యాలకు పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కోరారు. బడ్జెట్ సమావేశాలలో బుధవారం ఆమె మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీల రైతుల భూములను వైసీపీ నాయకులు భయపెట్టి లాక్కున్నారని ఆరోపించారు. రీసర్వే పేరిట భూముల విస్తీర్ణం తగ్గించారని, హద్దులు మార్చేశారని అన్నారు. భూముల రిజిస్ట్రేషన్ జరగక.. మ్యుటేషన్‌లు నిలిచిపోయాయని అన్నారు. కూటమి ప్రభుత్వం రీ సర్వేలోని లోపాలను పరిష్కరించేందుకు గ్రామ సభలు నిర్వహిస్తే.. 15 రోజుల వ్యవధిలోనే 1.69 లక్షల అర్జీలు వచ్చాయని అన్నారు. శింగనమల నియోజకవర్గంలో వైసీపీ నాయకులు అనేక మంది భూములు దౌర్జన్యంగా లాక్కున్నారని అన్నారు. భూ అక్రమాలపై ప్రతిరోజూ ఫిర్యాదులు వస్తున్నాయని, వైసీపీ హయాంలో భూములను లాక్కున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

రాయలచెరువులో ఉద్రిక్తత

ఇరువర్గాల ఘర్షణ

భూవివాదమే కారణం


ఇరువర్గాలకు సర్దిచెబుతున్న పోలీసులు

యాడికి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): భూవివాదంతో రాయలచెరువులో బుధవారం రాత్రి ఉద్రిక్త వాతావరణం నెలకొంది. రాయలచెరువులో సర్వే నంబరు 650/బీ, సీ, డీ, ఈ, ఎఫ్‌లోని 1.25 ఎకరాల స్థలంపై వివాదం నెలకొంది. రాయలచెరువుకు చెందిన మాదాల భాస్కర్ తల్లి పేరుతో భూమి ఉన్నట్లు రాయలచెరువు వాసులు చెబుతున్నారు. ఈ భూమిని వేరొక వ్యక్తితో తాము కొన్నామంటూ పులివెందులకు చెందిన ఒక ప్రముఖ నాయకుడి పేరు చెప్పి కొందరు వ్యక్తులు దౌర్జన్యానికి దిగారు. వివాద స్థలం వద్దకు బుధవారం సాయంత్రం వచ్చిన బయట వ్యక్తులు, రాయలచెరువు గ్రామానికి చెందిన వ్యక్తులు గొడవపడ్డారు. పరిస్థితి ఒకరిపై ఒకరు దాడిచేసుకొనే వరకు వెళ్లింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. ఇరువర్గాల వారిని స్టేషన్‌కు తీసుకువెళ్లారు. మంగళవారం ఇదే తరహా సంఘటన జరగడం గమనార్హం. ఇరువర్గాలను పోలీస్‌స్టేషన్‌కు రమ్మని చెప్పిన పోలీసులు.. బుధవారం ఉదయం ఆధారాలతో పోలీస్‌స్టేషన్‌కు రావాలని చెప్పి పంపారు. బుధవారం ఉదయం రాయలచెరువు చెందిన వ్యక్తులు మాత్రమే పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసి వెళ్లారు. పులివెందులకు చెందిన ప్రముఖ నాయకుడి మనుషులమంటూ రాత్రి కొందరు వ్యక్తులు రాయలచెరువుకు వచ్చి సదరు స్థలం వద్ద వివరాలు ఆరాతీశారు. సమాచారం అందుకున్న రాయలచెరువుకు చెందిన వ్యక్తులు అక్కడికి వెళ్లడంతో ఇరువర్గాలు గొడవపడ్డాయి. పరస్పరం దాడి చేసుకున్నారు. రెండురోజుల నుంచి రాయలచెరువులో నెలకొన్న సమస్యతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

ఆగిపోయిన ఇళ్ల నిర్మాణంపై 15 నుంచి సర్వే: కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వివిధ కారణాలతో ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాలపై ఈనెల 15వ తేదీ నుంచి ఇంటింటా సర్వే చేపట్టనున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో ఇళ్ల నిర్మాణాల పూర్తికి అమలు చేస్తున్న నూతన విధానంపై బుధవారం వివరాలు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ.. గతంలో ఇళ్లు మంజూరై వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్న వాటిని పూర్తి చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అందులో భాగంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అదనంగా ఆర్థికసాయం అందిస్తోందన్నారు. జిల్లాలో ఎస్సీలకు సంబంధించి 4,232, ఎస్టీలకు 904 ఇళ్ల నిర్మాణాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. బీసీలకు మంజూరైన 15,882 ఇళ్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. వాటి నిర్మాణాలను పూర్తి చేయడానికి ఎస్సీలకు అదనంగా రూ.50వేలు, బీసీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75 వేలు ఆర్థికసాయం అందజేస్తారన్నారు. ఇందుకు సంబంధించి సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, కార్యదర్శులు ఈనెల 15 నుంచి జిల్లాలో ఇంటింటా సర్వే చేపడతారన్నారు. ఆ నివేదికల మేరకు ప్రభుత్వం అదనపు ఆర్థికసాయం అందజేస్తుందని కలెక్టర్ వివరించారు. లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహిళల గురించి మాట్లాడే అర్హత ఉందా..?

జగన్‌పై మండిపడ్డ ఎమ్మెల్యే పరిటాల సునీత



అనంతపురం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వేతనాల కోసం రోడ్డెక్కి పోరాటం చేస్తున్న మహిళల్ని జగన్ జైలుకు పంపారని, సొంత తల్లి, చెల్లిని ఆస్తుల కోసం కోర్టుకు లాగారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత విమర్శించారు. అలాంటి వ్యక్తికి మహిళల గురించి మాట్లాడే అర్హత లేదని అన్నారు. అసెంబ్లీలో బుధవారం మహిళా సాధికారత అంశంపై ఆమె మాట్లాడారు. బడ్జెట్‌లో మహిళా శిశు సంక్షేమానికి రూ.4,300 కోట్లు కేటాయించారని, ఇది మహిళా బడ్జెట్ అని అన్నారు. గత ప్రభుత్వంలో ఎక్కడా మహిళలకు ప్రాధాన్యమివ్వలేదని అన్నారు. ఉచితంగా ఇళ్లు ఇస్తానని నమ్మించి జగన్ మోసం చేశారని అన్నారు. పెళ్లి కానుకలు రద్దు చేశారని, మహిళల కోసం గతంలో ఉన్న పథకాలన్నీ తొలగించారని అన్నారు. అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు వేతనాల కోసం నడిరోడ్డుపై రోజుల తరబడి ఉద్యమం చేసినా స్పందించలేదని, పైగా ఎస్మా పెట్టాలని చూశారని మండిపడ్డారు. ఇలాంటి పనులు చేసిన జగన్ రెడ్డి మహిళల సాధికారత కోసం పనిచేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబును విమర్శించడం సిగ్గుచేటని అన్నారు. వైసీపీ హయాంలో మహిళలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని ఆమె ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మహిళను హోంమంత్రిగా చేసి, ఆమె చేతికి అధికారం ఇవ్వకుండా చేసిన చరిత్ర జగన్‌దనని అన్నారు. తమ ముఖ్యమంత్రి మహిళను హోంమంత్రిగా చేయడంతో పాటు ఆమెకు ఆ శాఖ పట్ల పూర్తి బాధ్యతలు ఇచ్చారని అన్నారు. ఎక్కడ ఏ సంఘటన జరిగినా హోంమంత్రి అనిత వెంటనే స్పందించడం గర్వకారణమని అన్నారు. పది ఎకరాల్లోపు ఉన్నరైతులకు 90 శాతం సబ్సిడీ, ఎస్సీ, ఎస్టీలకు వందశాతం సబ్సిడీతో డ్రిప్, స్ప్రింక్లర్లు ఇవ్వడానికి అనుమతులిచ్చినందుకు సీఎం చంద్రబాబుకు ఆమె ధన్యవాదాలు తెలిపారు.



ఉష్ణోగ్రతలు	
బుధవారం	
గరిష్ఠం	37.0
కనిష్ఠం	23.0



ఇఫ్తార్	సెహరీ
6.31	5.12
గురువారం సాయంత్రం	శుక్రవారం ఉదయం

సింహ వాహనంపై శ్రీవారు
తిరుమలలో విహరిస్తూ.. భక్తులకు దర్శనం 6



సింహ వాహనంపై శ్రీవారు

తిరువీధుల్లో విహరిస్తూ.. భక్తులకు దర్శనం

కదిరి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాలలో భాగంగా ఖాద్రీ లక్ష్మీ నారసింహుడు బుధవారం సింహవాహనంపై తిరువీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. యాగశాల నుంచి ఉదయం విచ్చేసిన శ్రీవారికి గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం శ్రీవారిని సింహ వాహనంపై అలంకరించి, ఆలయ ప్రాంగణంలో కొలువుదీర్చారు. వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తిరువీధుల్లో శ్రీవారు విహరించారు. వాహన సేవలో ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు, సింహవాహనంపై విహరిస్తున్న నారసింహుడు



నేడు హనుమంత వాహనంపై..

ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి గురువారం హనుమంతవాహనంపై భక్తులకు దర్శనమిస్తారు. ఉదయం నిత్యపూజలు, హోమాల అనంతరం గ్రామోత్సవాన్ని నిర్వహిస్తారు. సంధ్యా సమయంలో హనుమంతవాహనంపై కొలువుదీరి శ్రీవారు తిరువీధుల్లో విహరిస్తారు. శ్రీ మహావిష్ణువు దశావతారాల్లో ఒక్కటి అయిన రాముడిని తన భుజస్కంధాలపై మోసిన హనుమంతుడు మరోసారి తనకు అవకాశం ఇవ్వాలని కోరగా, నృసింహావతారంలో కోరిక నెరవేరుతుందని శ్రీరాముడు వరమిచ్చారని, అందుకే నారసింహుడికి హనుమంత వాహన సేవ నిర్వహిస్తారని వేద పండితులు తెలిపారు.

సెల్‌లో చోరబాటు..!

ఏమరుపాటుగా ఉంటే బురిడీ కొట్టిస్తారు. ఆశకు పోతే లూటీ చేసేస్తారు. పెట్టుబడులు, రుణాలు, కొరియర్.. ఇలా ఏవేవో చెప్పి లైన్‌లోకి వస్తారు. లింకు పంపి ఓపెన్ చేయమంటారు. ఓటీపీ చెప్పమంటారు. బ్యాంకు అధికారులు, పోలీసులు, సీబీఐ.. ఇలా ఎవరెవరి పేరితో లైన్‌లోకి వచ్చి బెదిరిస్తారు. బ్యాంకులో ఉన్న సొమ్మును దోచుకుంటున్నారు. నేరుగా వచ్చి సొమ్ము దోచుకునే సొమ్ముకంటే ఎక్కడో ఉంటూ.. మన సెల్‌ఫోన్‌లోకి చొరబడి దోచుకునే సొమ్ము చాలా ఎక్కువ అని పోలీసులు అంటున్నారు. వీరితో జాగ్రత్తగా ఉండాలని ఏకంగా 'కాలర్ టోన్' ద్వారా అవగాహన పెంచుతున్నారంటే.. పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఎవరికివారు జాగ్రత్తగా ఉండటం దీనికి ఉత్తమ పరిష్కారం. ఒక్కసారి సొమ్ము దొంగలచేతిలో పడితే.. తిరిగి రావడం చాలా కష్టం. ఏ కొద్దిమంది సొమ్మో రికవరీ అవుతోంది.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం క్రైం/నెట్‌వర్క్



● అనంతపురం సమీపంలోని ఓ గ్రామానికి చెందిన రాగే ఎల్లప్ప బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. గతేడాది దసరా పండుగకు ఇక్కడకు వచ్చారు. అక్టోబరు 10న ఎస్‌బీఐ యోనో యాప్‌లో పాన్ కార్డు అప్‌డేట్ చేస్తుండగా... అప్‌డేట్ ఆధార్, ఆర్ పాన్ ఫర్ ఎస్‌బీఐ అనే పేరుతో ఏపీకే లింక్ వచ్చింది. అది క్లిక్ చేసిన వెంటనే రూ.49వేలు అతడి బ్యాంకు ఖాతా నుంచి డెబిట్ అయింది. కొంతసేపటికే మరోసారి రూ.50వేలు కట్ అయింది. దీంతో అప్రమత్తమైన ఎల్లప్ప కస్టమర్ కేర్‌కు ఫోన్ చేశారు. వారు రెస్పాన్స్ ఇచ్చేలోపే మరో సారి రూ.49,999 కట్ అయింది. దీనిపై బాధితుడు.. సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాని ఆధారంగా ఎస్‌బీఐ అధికారులను కలిశారు. ఆధార్, పాన్, ఫిర్యాదు లేఖ తీసుకున్నారు. ఇంతవరకు రికవరీ లేదు.



ఎల్లప్ప ఖాతా నుంచి డబ్బు వెళ్లగానే ఎస్‌బీఐ నుంచి వచ్చిన మెసేజ్

● గార్లదిన్నె మండలానికి చెందిన రామాంజికి ఈ ఏడాది జనవరి 24వ తేదీన వాట్సాప్ వీడియోకాల్ వచ్చింది. ఒకరు హిందీ, మరొకరు తెలుగులో మాట్లాడారు. తాము సీబీఐ అధికారులమనీ, సైబర్ క్రైం ఇష్యూకు సంబంధించి ముంబై నుంచి మాట్లాడుతున్నామని చెప్పారు. ఆధార్‌కార్డు దుర్వినియోగం చేశారనీ, కేసు నమోదైందనీ, ఇంట్లో ఉండి డోర్ వేసుకుని ఎవరితో మాట్లాడకుండా ఉండాలని చెప్పారు. బ్యాంకు ఖాతా వివరాలు చెప్పాలని కోరారు. ఫోన్‌పేలో డబ్బు ఎంత ఉందో స్క్రీన్‌షాట్ పెట్టమన్నారు. అది పెట్టగానే.. అకౌంట్ ట్రాన్సాక్షన్స్ చూస్తామని చెప్పి రూ.49,999 పంపమన్నారు. రామాంజికి అనుమానం వచ్చినా.. భయంతో వారికి ఫోన్‌పే చేశాడు. ఇంకో అకౌంట్ ఉంటే ఆ వివరాలు పంపాలన్నారు. మరో అకౌంట్‌లో రూ.1.50లక్ష ఉండటంతో బ్యాంకు వారితో మాట్లాడాలని చెప్పి ఫోన్ కట్ చేశాడు.



గార్లదిన్నె మండలానికి చెందిన వ్యక్తికి వీడియో కాల్ చేసింది ఈ వాట్సాప్ గ్రూప్ నుంచే





● అనంతపురం నగరంలోని హౌసింగ్‌బోర్డులో మేకల షేక్ హుస్సేన్, షేక్ రిజ్వానా దంపతులు నివాసముంటున్నారు. షేక్ హుస్సేన్ దక్షిణాఫ్రికాలో మైనింగ్ కంపెనీలో పనిచేస్తుంటారు. ఇక్కడకు వచ్చినపుడు సెప్టెంబరు 12న ఫేస్‌బుక్‌లో షేర్ మార్కెట్‌లో జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీస్ పేరుతో ఉన్న ఓ లింక్‌ను క్లిక్ చేశాడు. వెంటనే వాట్సాప్‌లో ఐశ్వర్యశాస్త్రి పేరుతో ఒకామె చాట్ చేసింది. ఇందులో పెట్టుబడి పెడితే లాభాలొస్తాయని చెప్పింది. ఈక్రమంలో షేక్ హుస్సేన్ తొలుత రూ.2లక్షలు, రూ.3లక్షలు.. ఇలా పెట్టుబడి పెడుతూ వచ్చారు. తిరిగి అక్కడకు వెళ్లాక తన భార్యతో బ్యాంకులో డబ్బు వేయించారు. అదే క్రమంలో రూ.15లక్షలు, రూ.20లక్షలు సైతం వేశారు. చివరకు ఇల్లు విక్రయించి డబ్బు పెట్టుబడి పెట్టినట్లు సమాచారం. అలా గతేడాది డిసెంబరు 4న ఒకేసారి రూ.40లక్షలు అతడి భార్య.. భర్త చెప్పిన అకౌంట్‌కు నగదు పంపారు. సంబంధిత బ్యాంకు మేనేజర్ 'ఎందుకు అంత అమౌంట్ పంపుతున్నారు.. రెండు రోజులు ఆలోచించండి..' అన్నారట. అయినా.. వారు వినలేదు. అలా మొత్తం రూ..1.33 కోట్లు పంపాక మోసపోయామని తెలిసింది. టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, సైబర్ పోలీసులకు తెలియజేశారు.

రెచ్చిపోతున్న సైబర్ దొంగలు

- లింకులు పంపి.. సొమ్ము చోరీ
- లోన్, ఇన్వెస్ట్‌మెంట్ పేరిట బురిడీ
- రెండేళ్లలో రూ.53 కోట్లు లూటీ
- అప్రమత్తత.. అవగాహనే శరణ్యం

● రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లికి చెందిన ఓ మహిళ గతనెల మొదటివారంలో పుట్టినిల్లయిన చెన్నే కొత్తపల్లి మండలం ఓబుళంపల్లికి వెళ్లింది. ఈనెల 2వ తేదీన ఆ మహిళ సెల్‌ఫోన్‌కు ఓ గుర్తుతెలియని నంబర్ నుంచి కాల్ వచ్చింది. ఆరోగ్యశ్రీ ఆఫీస్ నుంచి మాట్లాడుతున్నానని చెప్పాడు. 'మీ నాన్నకు ఆరోగ్య శ్రీ కింద రెండేళ్ల క్రితం శస్త్రచికిత్స చేశారనీ, దానికి సంబంధించి ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.40వేలు పెండింగ్‌లో ఉందనీ, ఆ మొత్తాన్ని బ్యాంకు ఖాతాకు జమ చేస్తా'నని నమ్మబలికాడు. అందుకు సెల్‌ఫోన్‌కు లింక్ పంపుతాననీ, దానిని ఓపెన్ చేసి క్లిక్ చేయాలని చెప్పాడు. అది నమ్మిన ఆ మహిళ తనకు వచ్చిన లింక్‌పై క్లిక్ చేసింది. కొంతసేపటికే రూ.47,287 ఆమె బ్యాంకు అకౌంట్ నుంచి కట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. విషయం ఆ మహిళ.. సంబంధిత గుర్తుతెలియని వ్యక్తికి చెప్పగా... మరోసారి లింకు పంపిస్తాననీ, పెండింగ్‌లో ఉన్న బిల్లు, ఇప్పుడు పోయిన మొత్తం జమ అవుతుందని చెప్పాడు. అలా మరో లింక్‌ను క్లిక్ చేయగానే.. క్షణాల్లో రూ.40వేలు ఖాతా నుంచి వెళ్లినట్లు మెసేజ్ వచ్చింది. అదే విషయంలో ఆమె నిలదీయగా.. మరోసారి ట్రై చేయమన్నాడు. ఈసారి క్లిక్ చేయగానే... అమె అకౌంట్ నుంచి రూ.17500 డబ్బు మాయమైంది. దీంతో మోసపోయానని గ్రహించి టోల్‌ఫ్రీ నంబర్ 1930కు ఫోన్ చేసి, విషయం తెలియజేసింది. అనంతరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.



● నెలరోజుల క్రితం అనంతపురంలోని రామచంద్రనగర్‌లో ఓ జనరల్ స్టోర్ నిర్వాహకుడు... ఫోన్ పేలో సమస్య రావడంతో గూగుల్‌లో ఫోన్‌పే కస్టమర్ కేర్ నంబర్ సెర్చ్ చేశాడు. కొన్ని నంబర్లు కనిపించాయి. అందులో మొదటి నంబర్‌కు కాల్ చేసి, సమస్య చెప్పాడు. అవతలి వ్యక్తి మాట్లాడుతూ.. 'నీ ఫోన్ పేకు రూపాయి పంపుతాన'ని చెప్పాడు. జనరల్ స్టోర్ నిర్వాహకుడిని రూపాయి పంపమని కోరాడు. ఈ సమస్య ఇలాగే కొనసాగుతుందని చెప్పి.. ఓటీపీ వస్తుందనీ, అది చెప్పమన్నాడు. షాపు నిర్వాహకుడు ఓటీపీ పంపిన సెకన్లలో అతడి బ్యాంక్ అకౌంట్‌లో ఉన్న రూ.8వేలు కట్ అయింది.

● ముదిగుబ్బ మండలంలోని ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తూ ఇంటి వద్ద ఉంటున్నాడు. జనవరిలో సైబర్ నేరగాళ్లు వీడియోకాల్ చేసి, 'నీపై 18 కేసులు నమోదయ్యాయనీ, నీ పేరుతో అక్రమ రవాణాలు సాగుతున్నాయనీ, రూ.4.50 లక్షలు పంపితే అకౌంట్ ఫ్రీజ్ కాకుండా ఆపుతామ'ని బెదిరించారు. దీంతో భయపడిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మొత్తం డబ్బు యాప్‌లో పంపాడు.

● ముదిగుబ్బ మండలంలోని ఒక వ్యక్తికి కారు లాటరీ తగిలిందని వాట్సాప్‌లో ఫొటోలు పంపారు. జీఎస్టీ, రిజిష్ట్రేషన్ తదితరాలకు అమౌంట్ పంపాలని నమ్మబలికారు. రూ.6లక్షలు సైబర్ నేరగాళ్లు జమ చేయించుకున్నారు. తరువాత మోసపోయానని తెలుసుకున్న బాధితుడు.. పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

● ముదిగుబ్బ మండలంలోని ఒక వ్యాపారికి తన ఖాతాలోకి 5వేల రూపాయలు జమ అయినట్లు మెసేజ్ వచ్చింది. మెసేజ్ ఓపెన్ చేసి చూసేసరికి రూ.32వేలు ఖాతా నుంచి మాయమైంది. దీనిపై బాధితుడు.. సైబర్ క్రైం హెల్ప్‌లైన్ నంబర్ 1930కి కాల్ చేసి తెలిపాడు.

● గుంతకల్లులో పలువురు వ్యక్తులు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కి డబ్బు పోగొట్టుకున్నారు. డిసెంబరులో 12, ఈ ఏడాది జనవరిలో 17 సైబర్ నేరాల కేసులు నమోదయ్యాయి. పట్టణానికి చెందిన జీ రామాంజనేయులు అనే రైల్వే ఉద్యోగి ఖాతా నుంచి నెల కిందట రూ.95,000 తస్కరించారు. జీతం పడిన వెంటనే రూ.50 వేలు, రెండో దఫాగా రూ.45 వేలు డబ్బు డ్రా అయిపోయాయి. బ్యాంకుకు వెళ్లి అడిగితే ట్రాన్సాక్షన్‌కు సంబంధించిన వివరాలేవీ లభ్యం కావడంలేదని బ్యాంకు అధికారులు చేతులెత్తేశారని బాధితుడు వాపోయాడు. సంపత్ కుమార్ అనే వ్యక్తికి డ్రోన్ కెమెరా పంపుతున్నామంటూ రూ.17 వేలు కాజేశారు. వరదరాజులు అనే మాజీ కౌన్సిలర్ ఖాతా నుంచి రూ.20 వేలు తస్కరించారు. మూడు నెలల కిందట వజ్రకరూరు మండలం గంజికుంట గ్రామానికి చెందిన శివారెడ్డి వాట్సాప్‌కు ఓ పోస్టు రాగా, దాన్ని చూడటానికి టచ్‌చేశారు. వెంటనే అతడి ఫోన్‌లోకి ఓ సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాల్ అయ్యి అతడి బ్యాంకు ఖాతా నుంచి రూ. 9,975 చొప్పున రెండుసార్లు డబ్బు డ్రాచేసేశారు. వీటన్నిటిపైనా సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదులు అందాయి. ఒక్క కేసూ పరిష్కారం కాలేదు.

ఎక్కువగా ఇలా చేస్తారు...!



సైబర్ నేరగాళ్లు సీబీఐ, ఈడీ, నార్కోటిక్, ఐటీ, ఆర్‌బీఐ, కస్టమ్స్, పోలీసు అధికారులం అంటూ ఫోన్ కాల్ చేస్తుంటారు. 'మీ పేరుపై కొరియర్ వచ్చిందని, అందులో డ్రగ్స్ వెపన్స్, అక్రమ వస్తువులు ఉన్నాయ'ని బెదిరిస్తారు. 'మీ బ్యాంకు అకౌంట్, ఆధార్, పాన్, మొబైల్ నంబర్ల ద్వారా మనీ ల్యాండరింగ్ జరిగిందనీ, మీపై కేసులున్నాయని వీడియో కాల్ ద్వారా విచారణ' అంటూ డిజిటల్ అరెస్ట్ పేరుతో భయభ్రాంతులకు లోనుచేస్తారు. ఈ కేసులో బెయిల్ కావాలన్నా కేసు నుంచి తప్పించాలన్నా డబ్బు పంపాలని బెదిరిస్తుంటారు. ఇలా డబ్బు దోచుకోవటాన్ని డిజిటల్ అరెస్ట్ ఫ్రాడ్ అంటారు.

ఫేక్ లోన్‌యాప్ ఫ్రాడ్

సామాజిక మాధ్యమాల ద్వారా లింకులు పంపి లోన్ పొందడానికి ఎలాంటి డాక్యుమెంట్స్ అవసరం లేదని ఎర వేసి, చిన్న మొత్తంలో లోన్ ఇచ్చి, రోజులు గడవకముందే ఫోన్ చేసి వడ్డీతో సహా డబ్బు కట్టమనీ, లేదంటే ఫొటోలను మార్ఫింగ్ చేసి, కుటుంబ సభ్యులు, స్నేహితులకు పంపుతామని బలవంతంగా డబ్బు తీసుకుంటారు. దన్ని ఫేక్ లోన్‌యాప్ ఫ్రాడ్ అంటారు.

ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్..

సామాజిక మాధ్యమాల్లో ప్రకటనలు చేసి తమ సంస్థ ద్వారా స్టాక్‌మార్కెట్‌లో ట్రేడింగ్/ఇన్వెస్ట్‌మెంట్ చేస్తే తక్కువ సమయంలో అధిక లాభాలు పొందవచ్చని నకిలీ యాప్స్/వెబ్‌సైట్లలో లాభాలు పొందుతున్నట్లు చూపిస్తూ డబ్బు దోచేస్తున్నారు.

ఏపీకే ఫైల్ ఫ్రాడ్

సైబర్ నేరగాళ్లు మోసపూరితమైన లింక్స్/ఏపీకే ఫైల్స్ పంపి వాటిని క్లిక్ చేస్తే మొబైల్‌లో హానికరమైన ఏపీకే ఫైల్ ఇన్‌స్టాల్ అయి, వాట్సాప్‌ను హ్యాక్ చేసి వ్యక్తిగత, ఆర్థిక సమాచారం అపహరిస్తారు. తద్వారా డబ్బును దోచేస్తారు. స్నేహితులు, కుటుంబసభ్యులకు ఈ హానికరమైన ఏపీకే ఫైల్స్‌ను పంపి, వారి మొబైల్ ఫోన్స్ హ్యాక్ చేస్తారు. ఇంకా టెలిగ్రామ్‌లలో ఇన్వెస్ట్ చేయాలని చెబుతూ... రూ.వెయ్యికి రూ.1500 అదనంగా వేస్తారు. రూ.2వేలకు రూ.3000 రూ.5వేలకు రూ.8వేలు పంపుతారు. రూ.7వేలు వేయగానే డబ్బు రాదు. డబ్బు రావాలంటే అదనంగా పంపాలని మోసం చేస్తాడు. ఆ మొత్తం పంపితే అంతే సంగతి.

తిరిగొచ్చేది చాలా తక్కువ...

అనంతపురం నగరంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ మహిళ గతేడాది ఏప్రిల్‌లో తన బ్యాంకు అకౌంట్ నుంచి రూ.10లక్షలు మాయమయ్యాయని సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారించిన సైబర్ క్రైమ్ విభాగాధికారులు అ డబ్బు వెళ్లిన విధానం విస్తుగొలిపింది. మధ్యలో ఎలాంటి సంబంధంలేని వ్యక్తి అకౌంట్ ద్వారా సైబర్ నేరగాళ్లు ఆ డబ్బు లాక్కున్నారు. ఆ మహిళ అకౌంట్ నుంచి పశ్చిమ బెంగాల్‌లోని ఓ ప్రభుత్వ ఉద్యోగి అకౌంట్‌కు వెళ్లింది. ఆ అకౌంట్ నుంచి సైబర్ నేరస్తులు మరో అకౌంట్‌కు బదిలీ చేసుకున్నారు. ఎట్టకేలకు పోలీసులు ఆ డబ్బు తిరిగి ఆ మహిళ అకౌంట్‌కు వచ్చేలా చేశారు. ఇలాంటి కేసులు చాలా తక్కువనీ, ముందుగానే వివరాలన్నీ తెలియజేసి, వారికి డబ్బు పంపుతున్నట్లు సమాచారం చేరవేస్తే ఆ డబ్బు తీసుకురావడం చాలా కష్టమంటున్నారు సైబర్ విభాగ అధికారులు.

రూ.కోటి వెళ్తే... రూ.22లక్షలే వచ్చాయి..

ఏడాదిన్నర క్రితం నగరంలోని వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ బార్ అండ్ రెస్టారెంట్ యజమాని అకౌంట్ నుంచి రూ.కోటి మాయమైంది. మరుసటి రోజు బ్యాంకు అధికారులు విషయం తెలియజేశారు. కేవలం ఆరు ట్రాన్సాక్షన్లతోనే రెండురోజుల వ్యవధిలో రూ.కోటి మాయమైంది. సైబర్ నేరగాళ్లు అలా దోచేసిన ఘటనపై బాధితుడు.. వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇందులో హర్యానా, ఢిల్లీ వాసుల ప్రమేయం ఉందని తెలిసి పోలీసులు పలుసార్లు తిరిగి రూ.22లక్షలు మాత్రమే పట్టుకురాగలిగారు. బ్యాంకు బాధితుడికి బాధ్యతగా ఆ డబ్బు అందజేయాల్సి ఉంటుంది. అది వేరే సంగతి.

రోజూ 10 ఫిర్యాదులు

జిల్లావ్యాప్తంగా ఫ్రాడ్‌కాల్స్‌పై రోజూ 8 నుంచి 10 ఫిర్యాదులు వస్తుంటాయని సైబర్ విభాగ అధికారులు చెబుతున్నారు. ముందుగానే బ్యాంక్ అకౌంట్ వివరాలన్నీ తెలియజేసి, డబ్బు పంపితే వెనక్కు తీసుకురావడం కష్టమేనంటున్నారు సైబర్ పోలీసులు. ఉన్నఫలంగా అకౌంట్ నుంచి మాయమైతే అది కూడా కొన్ని గంటల్లోపే ఫిర్యాదు చేస్తే కొంతవరకు హోల్డ్ చేసే అవకాశం ఉంటుందని వారు చెబుతున్నారు.



చైనీస్ మూలాలేనా..?

సైబర్ మోసాల వెనుక చైనీస్ మూలాలున్నట్లు పోలీసు వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ మోసాల ద్వారా వెళ్లే డబ్బు టాప్‌లో నడిపిస్తున్న ఒకే ఒక్కడికి ఎక్కువ శాతం వెళ్తుంటుంది. ఈ సైబర్ క్రైమ్‌లో పాలుపంచుకున్న వారికి పర్సెంటేజీల తరహాలో వెళ్తుంటుంది. ఆ కీలక వ్యక్తి ఎవరనేది ఎవరికీ తెలియదు. ఈ వ్యవహారమంతా అంతర్జాతీయ స్థాయిలో సాగుతోందనేది ఒక అంచనా. చాలాసార్లు ఈ డబ్బు దేశాన్ని సైతం దాటిపోయి ఉంటుందని సైబర్ వర్గాలు చెబుతున్నాయి. అలాంటి పరిస్థితుల్లో ఆ డబ్బు తిరిగి ఖాతాల్లో జమ అవడం చాలా చాలా కష్టమట. ఫేక్ ఫైల్స్ ఉన్న లింకులను ఓపెన్ చేయకపోవడం, ఎవరైనా ఫోన్ చేసి వ్యక్తిగత బ్యాంకు, ఆధార్, పాన్, ఓటీపీలను అడిగితే చెప్పకపోవడమే సేఫ్. నష్టపోయి, పోలీసులను ఆశ్రయించడం ద్వారా పెద్దగా ఉపయోగమేమీ ఉండకపోవచ్చు. జాగ్రత్తే శ్రీరామ రక్ష.

రెండేళ్లలో రూ.53కోట్ల దోపిడీ..

జిల్లాలో దోపిడీ దొంగల కంటే సైబర్ నేరస్తులు ఎత్తుకెళ్లేదే ఎక్కువగా ఉంది. జిల్లా పరిధిలో ఏటా జరిగే చోరీల్లో రూ.6కోట్ల వరకు దోచుకెళ్తుంటారనేది పోలీసు వర్గాల అంచనా. గత రెండేళ్లలో సైబర్ నేరగాళ్లు రూ.53కోట్లు కాజేశారట. 2023, 24 సంవత్సరాల్లో జిల్లావ్యాప్తంగా ఇంత మొత్తం కాజేసి ఉంటారని సైబర్ లెక్కలు చెబుతున్నాయి.

రైతులనూ వదలక..

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో రైతన్నలు కూడా చిక్కుతున్నారు. బొమ్మనహాళ్ మండలం దర్గా హొన్నూరు ప్రాంతానికి చెందిన ఇద్దరు రైతులు ఖాతాల నుంచి సైబర్ నేరగాళ్లు డబ్బు దోచేశారు. ఈ ఏడాది జనవరి 20వ తేదీన దర్గాహొన్నూరు గ్రామానికి చెందిన రైతు చిత్రశేఖర్ మొబైల్ నంబరుకు ఓటీపీ వచ్చింది. కెనరా బ్యాంకు నుంచి మొదటి సారి రూ.99వేలు కట్ అయింది. రెండో సారి మళ్లీ ఓటీపీ వచ్చిం ది. మళ్లీ రూ.49,999 కట్ అయింది. బ్యాంకు అధికారులను సంప్రదిస్తే ఫోన్‌పే లింకు ద్వారా కట్ అయిందని చెప్పారు. పోలీసులకు ఫిర్యాదు చేశాననీ, ఇంకా డబ్బు రాలేద ని బాధితుడు వాపో యాడు. బొమ్మన హాళ్ మండలం దర్గాహొన్నూరు చెందిన నుంకేష్ మొబైల్‌కు జనవరిలో ఓటీపీ వచ్చింది. రూ.5 వేలు చొప్పున రెండుసార్లు కట్ అయింది. దీంతో జాగ్రత్త పడి రూ.50వేలు స్నేహి తుడికి ఫోన్ పే చేసి, కాపాడుకోగలిగాడు.





రైతులు నుంకేష్, చిత్ర శేఖర్,



15నుంచి డ్వామాలో బదిలీలు

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): డ్వామాలో ఉద్యోగుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ షణ్ముఖ్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లా యూనిట్‌గా బదిలీలు చేపట్టే అవకాశం ఉంది. మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులు అర్హులు. ఐదేళ్లు ఒకేచోట పనిచేస్తున్న వారు కచ్చితంగా క్లస్టర్ మారాల్సి ఉంటుంది. డ్వామాలో పనిచేస్తున్న ఏపీఓ, ఈసీ, టీఏ, కంప్యూటర్ ఆపరేటర్లకు బదిలీలు చేపట్టనున్నారు. ఈనెల 15న ప్రక్రియ ప్రారంభించి, ఈనెల 20వతేదీలోపు పూర్తి చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈనెల 22వ తేదీలోపు ఉద్యోగులు బదిలీ అయిన స్థానంలో చేరాల్సి ఉంటుంది. ఈనెల 24వ తేదీలోపు ఉద్యోగుల బదిలీ వివరాలను సీఆర్‌డీ కార్యాలయానికి పంపాల్సి ఉంటుంది. ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు ఉద్యోగుల బదిలీల ప్రక్రియ ప్రారంభించి, పారదర్శకంగా పూర్తి చేస్తామని డ్వామా పీడీ సలీంబాషా తెలిపారు.

40 మంది ఇంజనీర్లకు విముక్తి

కూటమి ప్రభుత్వ నిర్ణయంపై హర్షం

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ హయాంలో నీరు-చెట్టు పథకం కింద పనులు చేసినందుకు కక్షగట్టి గత వైసీపీ ప్రభుత్వం చేసిన విజిలెన్స్ విచారణలు, వేధింపులు, క్రమశిక్షణ చర్యల నుంచి ఉమ్మడి జిల్లాలో సుమారు 40 మంది జలవనరుల శాఖ ఇంజనీర్లకు విముక్తి లభించింది. జలవనరుల శాఖ ఇంజనీర్లపై కక్ష సాధింపులు, క్రమశిక్షణా చర్యలు, విజిలెన్స్ విచారణలు నిలిపివేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీచేశారు. అప్పట్లో మైనర్ ఇరిగేషన్, హెచ్చెల్సీలో పనిచేసిన ఇంజనీర్లు కూటమి ప్రభుత్వం నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. అప్పట్లో మైనర్ ఇరిగేషన్ ఈఈగా పనిచేసిన ప్రస్తుత హంద్రీనీవా ఎస్ఈ రాజా స్వరూప్‌కుమార్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్‌కు ధన్యవాదాలు తెలిపారు. తీవ్రంగా నష్టపోయిన బాధిత ఇంజనీర్లకు ప్రభుత్వ నిర్ణయం ఊరట కల్పించిందని సంతోషం వ్యక్తం చేశారు.

జర్మనీలో ఉద్యోగావకాశాలు

పుట్టపర్తి రూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): డిగ్రీ, డిప్లొమా, మెకట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్, ఎనర్జీ సిస్టం ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన వారికి జర్మనీలో ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ బుధవారం ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 40 ఏళ్ల వయసువారు అర్హులన్నారు. ఏదేని రంగంలో మూడేళ్ల అనుభవం కలిగిన వారికి ఇంగ్లిష్ ప్రొఫిషియెన్సీ, టెక్నికల్ స్కిల్ అసెస్మెంట్ టెస్టులు ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారన్నారు. ఆసక్తిగలవారికి 4 నెలలపాటు విజయవాడ, విశాఖపట్నంలో జర్మన్ భాషపై శిక్షణ ఇస్తామన్నారు. ఏ2 పరీక్ష ఉత్తీర్ణత అనంతరం జర్మనీలో ఉపాధి కల్పిస్తారన్నారు. ఇందుకు సంబంధించి వీసా, విమాన ప్రయాణ ఖర్చులన్నీ ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు https://naipunyam.ap.gov.in వెబ్‌సైట్ లోగానీ, 9988853335, 8712655686 నంబర్లలోగానీ సంప్రదించాలన్నారు.

అంజినయ్య సేవలు మరువలేనివి


అంజినయ్యకు నివాళులర్పిస్తున్న ఇండేన్ గ్యాస్ కార్యాలయ సిబ్బంది

ఉరవకొండ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): సత్యసాయి సేవాసంస్థల ఉమ్మడి రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అంజినయ్య ఆ సంస్థల ద్వారా ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని పలువురు వక్తలు కొనియాడారు. పట్టణంలోని ఇండేన్ గ్యాస్ కార్యాలయ సమీపంలో బుధవారం అంజనయ్య వైకుంఠ సమారాధనను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పాల్గొని ఆయన చిత్ర పటం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ప్రజలకు ఆయన చేసిన సేవల్ని కొనియాడారు. అనంతరం పేదలకు దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పారా విశ్వనాథ్, సత్యసాయి ఇండియన్ గ్యాస్ కార్యాలయ మేనేజరు నరేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చేస్తే చర్యలు

08554-228234కు ఫోన్ చేయండి: డీఎంహెచ్ఓ

అనంతపురం టౌన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): గర్భస్థపిండ లింగనిర్ధారణ చేయడం చట్ట విరుద్ధమని, ఎక్కడైనా, ఎవరైనా ఆ పరీక్షలు చేస్తే చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్ఓ ఈబీ దేవి బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో ప్రత్యేక ఫిర్యాదుల సెల్ ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లాలో ఉన్న స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణకు పాల్పడినట్లు తెలిస్తే వెంటనే 08554-228234 నంబర్‌కు ఫోన్‌చేసి తెలియజేయవచ్చన్నారు. స్కానింగ్ సెంటర్లు, పరీక్షలు చేసిన డాక్టర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, సమాచారం ఇచ్చిన వారిపేర్లు గోప్యంగా ఉంచుతామని డీఎంహెచ్ఓ తెలిపారు.

సీఆర్సీలకు రూ.1.35 కోట్లు..

అనంతపురం విద్య, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కొత్తగా ఏర్పాటు చేసిన క్లస్టర్ రిసోర్స్ సెంటర్ల(సీఆర్‌సీ)కు భారీగా గ్రాంటు విడుదల చేసినట్లు సమగ్రశిక్ష ఏపీసీ శైలజ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో 135 సీఆర్సీలకు మీటింగ్ టీఏ, మెయింటెనెన్స్, కంటింజెన్సీ, టీఎల్ఎం గ్రాంటు కింద ఒక్కో సెంటర్‌కు రూ. లక్ష చొప్పున విడుదల చేశామన్నారు. సీఆర్సీల ప్రధానోపాధ్యాయులకు రూ.1.35 కోట్లు నాలుగు పద్దుల కింద విడుదల చేశామన్నారు. మండల విద్యాశాఖాధికారుల ఆమోదంతో నిబంధనలకు మేరకు ఖర్చు చేసి టీసీఎస్ రూపొందించిన యాప్ ద్వారా వివరాలు అప్‌లోడ్ చేయాలన్నారు.

జూనియర్ కళాశాలలకు...

జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు కాంపోజిట్ స్కూల్ గ్రాంటు విడుదల చేసినట్లు ఏపీసీ తెలిపారు. జిల్లాలో 26 కళాశాలకు మొత్తం రూ. 16 లక్షలు విడుదల చేశామన్నారు. ఎంఈఓల ఆమోదంతో నిబంధనలకు మేరకు ఖర్చు చేసి టీసీఎస్ రూపొందించిన యాప్‌లో, ప్రబంధ్ పోర్టల్‌లో వివరాలు అప్‌లోడ్ చేయాలని ప్రిన్సిపాళ్లు, ఎంఈఓలను ఆదేశించారు.

డుమ్మాలకు చెక్..!

సచివాలయ సిబ్బందికి ముఖహాజరు తప్పనిసరి
గైర్హాజరుపై డీడీఓలకు షోకాజ్‌లు
వివరణ ఇవ్వడానికి డీపీఓ కార్యాలయానికి క్యూ..



అనంతపురం న్యూటౌన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పనుల కోసం ప్రజలు.. సచివాలయాలకు వెళితే సిబ్బంది ఉండరన్న విమర్శ ముందునుంచీ ఉంది. దీంతో ప్రజలు పదేపదే సచివాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. దీనికి చెక్ పెట్టాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. పాలన మెరుగు పరిచేందుకు అడుగులు వేస్తోంది. ఆ దిశగా ముఖహాజరు తప్పనిసరి చేసింది. దీనిని సిబ్బంది సీరియస్‌గా తీసుకోకుండా ఇబ్బందులు కొని తెచ్చుకున్నారు. సచివాలయ సిబ్బంది గైర్హాజరుపై సంబంధిత డీడీఓలకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నారు. దీంతో సచివాలయ ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది. నోటీసులు అందుకున్న డీడీఓలు వివరణ ఇచ్చుకునేందుకు జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) కార్యాలయానికి క్యూ కట్టారు. వారు ఇచ్చే వివరణ నిబంధనలకు అనుగుణంగా లేకుంటే చర్యలు తప్పవని డీపీఓ నాగరాజనాయుడు స్పష్టం చేస్తున్నారు.

లైట్ తీసుకుని..

సచివాలయ సిబ్బంది ఇష్టారాజ్యంగా కార్యాలయానికి వచ్చివెళ్తామంటే కుదరదు. సమయపాలన పాటించాల్సిందే. ఉదయం, సాయంత్రం రెండుపూటలా ఫేస్ యాప్‌లో ముఖ హాజరు తప్పనిసరిగా వేయాల్సిందే. గత ప్రభుత్వ హయాంలో ముఖ హాజరు ఉన్నప్పటికీ నిర్వహణలో విఫలమవడంతో సిబ్బంది సచివాలయాలకు ఇష్టారాజ్యంగా వచ్చిపోయేవారన్న విమర్శలున్నాయి. దీంతో పనులపై సచివాలయాలకు వచ్చే ప్రజలకు కనీస సమాచారం ఇచ్చేవారు ఉండేవారు కాదు. ప్రతి సచివాలయంలో పలు విభాగాలకు సంబంధించి 10 మంది వరకు సిబ్బంది ఉన్నారు. అయినా.. సాకులు చెబుతూ.. కార్యాలయాలకు డుమ్మాకొట్టే సిబ్బందే ఎక్కువన్న విమర్శలున్నాయి. దీనిపై పెద్దఎత్తున ఫిర్యాదులు రావడంతో కూటమి ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. గతేడాది డిసెంబరు ఒకటో తేదీ నుంచే ముఖహాజరు రెండు పూటలా తప్పనిసరి చేసింది. అయినా.. సిబ్బందిలో మార్పు రాలేదు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వస్తుంటాయనీ, అవి మామూలేనన్నట్లు డుమ్మారాయుళ్లు లైట్ తీసుకున్నారు. కొంతమంది విధులకు హాజరైనా క్షేత్రస్థాయికి వెళ్లినపుడు యాప్‌లో ఉన్న ఆప్షన్స్ వినియోగించడంలో అవగాహన లేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. సాధారణ రోజుల్లో సమయానికి అనుగుణంగా సంబంధిత సచివాలయం వద్దకు వెళ్లి హాజరు వేసుకుంటే సరిపోతుంది. పింఛన్ పంపిణీ, ప్రభుత్వ కార్యక్రమాల అమలులో భాగంగా క్షేత్రస్థాయికి వెళ్లినపుడు రెగ్యులర్‌గా వినియోగించే ఆప్షన్ కాకుండా మరొక దాని ద్వారా హాజరు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. దీనిపై అవగాహనలేని సిబ్బంది హాజరు వేయలేకపోయారు. అయినా క్షేత్రస్థాయిలో పని చేస్తున్నామనీ, హాజరుతో ఏం పని అన్నట్లుగా వ్యవహరించారు. వారి నిర్లక్ష్యం ఫలితంగా షోకాజ్ నోటీసులు తీసుకుని, వివరణ ఇచ్చుకోవాల్సిన పరిస్థితి తెచ్చుకున్నారు.

గతనెల 28న జారీ చేసిన నోటీసు ప్రకారం ముఖహాజరు వివరాలివీ..

మండలం	సచివాలయం	కార్యదర్శుల సంఖ్య	హాజరు సంఖ్య	గైర్హాజరు శాతం
కణేకల్లు	తుంబిగనూరు	3	1	66.6
అనంతపురం	కందుకూరు-1	8	3	62.5
అనంతపురం	రాజీవ్ కాలనీ-2	7	3	57.14
బెలుగుప్ప	హనిమిరెడ్డిపల్లి	10	4	60
బీకేఎస్	చెన్నంపల్లి-1	8	4	50
గుమ్మఘట్ట	తాళ్లకేర-1	6	3	50
బ్రహ్మసముద్రం	పాలవెంకటాపురం	7	4	42.86
కంబదూరు	కర్తనపల్లి	7	4	42.86
కుందుర్పి	బెస్తరపల్లి	10	7	30

విధులపై నిర్లక్ష్యం

ఉమ్మడి జిల్లాలో 1044 పంచాయతీలున్నాయి. వీటిలో గ్రేడ్-1కు సంబంధించిన కార్యదర్శులు 49 మంది, 18 మంది గ్రేడ్-2, 115 మంది గ్రేడ్-3, 441 మంది గ్రేడ్-4 ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ అమలులో భాగంగా చేపట్టిన నియామకాల్లో 567 మంది గ్రేడ్-5, 896 మంది గ్రేడ్-6 కింద ఉన్నారు. గ్రేడ్-6 మినహా ఐదు గ్రేడ్లకు సంబంధించిన వారికే చాలా వరకు డీడీఓ అధికారాలున్నాయి. వీరి ఆధీనంలోనే మిగిలిన విభాగాలకు చెందినవారు పని చేయాల్సి ఉంటుంది. ప్రతి సచివాలయంలో అన్ని విభాగాలకు సంబంధించిన వారు దాదాపు 10 మంది దాకా ఉండటంతో వారందరి హాజరు బాధ్యత డీడీఓపైనే ఉంటుంది. ఈనెల 1వ తేదీ మాత్రమే ఏకంగా 126 మంది డీడీఓలకు సంబంధిత సిబ్బంది హాజరు నమోదు చేయలేదనీ, క్రమం తప్పకుండా వేసేలా చూడాలనీ, గైర్హాజరుపై వివరణ ఇవ్వాలని డీపీఓ కార్యాలయం నుంచి షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. దీంతో ఖంగుతిన్న డీడీఓలు... డీపీఓ కార్యాలయానికి వివరణ ఇవ్వడానికి క్యూ కడుతున్నారు. డీడీఓ అధికారాలు ఉండటంతో ఎలాంటి ఇబ్బందులు పడాల్సి వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. గతంలో మాతృశాఖ అధికారులు ఆ శాఖకు సంబంధించిన పని చెప్పారన్న సాకులతో సచివాలయాలకు డుమ్మా కొట్టేవారు. సంబంధిత అధికారుల వ్యక్తిగత పనులు చేసేవారన్న విమర్శలున్నాయి. ముఖ హాజరు తప్పనిసరి చేయడంతో వ్యక్తిగత పనులకు వెళ్లేవారికి ఇబ్బందిగా మారిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వ నిర్ణయంతో సచివాలయాలకు వచ్చే ప్రజలకు తగిన న్యాయం చేకూరే అవకాశం ఉందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ధ్రువీకరణ పత్రం కోసం సచివాలయానికి వెళ్తే సంబంధిత సిబ్బంది ఉండరు. దీంతో పలుమార్లు తిరగాల్సి వచ్చేది. ప్రభుత్వ నిర్ణయంతో ముఖహాజరు కోసమైనా సచివాలయానికి వెళ్లాల్సిందే. ఆ సమయంలో ప్రజలు తమకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు పొందడానికి అవకాశం ఉంటుంది.

హాజరు లేదంటే చర్యలు తప్పవ్..

ముఖ హాజరుపై డీడీఓలకు హెచ్చరికలు జారీ చేస్తున్నాం. అయినా కొన్ని ప్రాంతాల్లో మార్పు రాలేదు. ప్రభుత్వం దీనిని సీరియస్‌గా పరిగణిస్తోంది. దీంతో నిర్లక్ష్యం వహించే వారికి నోటీసులు జారీ చేశాం. సరైన వివరణ ఇవ్వకుంటే క్రమశిక్షణ చర్యలు తప్పవు.

-నాగరాజనాయుడు, డీపీఓ

మామిడికి రక్షణ కవచం

50 శాతం సబ్సిడీ వర్తింపు: కలెక్టర్

అనంతపురం అర్బన్/నంబులపూలకుంట, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మామిడి రక్షణ కవచం ద్వారా అనేక లాభాలున్నాయని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. స్థానిక ప్రాంతీయ ఉద్యాన శిక్షణా కేంద్రంలో ఉద్యాన శాఖ జిల్లా అధికారి నరసింహారావు, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, జేడీఏ ఉమామహేశ్వరమ్మతో కలిసి అధికారులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. జిల్లా రైతులకు హెక్టారుకు 10వేల కవర్లు సబ్సిడీతో అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఒక్కో కవర్ పూర్తి ధర రూ.2 కాగా 50 శాతం సబ్సిడీ ఇస్తామని తెలిపారు. రైతులు స్వయంగా రక్షణ కవర్లను కొనుగోలు చేసి వినియోగించుకున్నా వారి ఖాతాల్లో సబ్సిడీ సొమ్ము జమ చేస్తామని తెలిపారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా రక్షణ కవర్లను కొనుగోలు చేస్తే సంఘాల ఖాతాకు సబ్సిడీ డబ్బులు జమ చేస్తామని తెలిపారు. కవర్ వాడటం ద్వారా ఊజి ఈగ, మచ్చలు, తేనె మంచు పురుగు, తామర పురుగు తదితర తెగుళ్లను నివారించవచ్చని, నాణ్యమైన పండ్ల దిగుబడి సాధ్య మౌతుందని తెలిపారు. క్రిమి కీటకాలు, అధిక సూర్యరశ్మి నుంచి పండ్లకు రక్షణ కల్పించవచ్చునన్నారు. ఫ్రూట్ కవర్‌ను వినియోగిస్తే పురుగు మందులు వాడాల్సిన అవసరం ఉండదని అన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

మామిడి తోటలు ప్రస్తుతం పిందె దశలో ఉన్నందున యాజమాన్య పద్ధతులు పాటించాలని కదిరి ఉద్యానవనశాఖాధికారి ప్రతాప్‌రెడ్డి బుధవారం తెలిపారు. ప్రస్తుతం నల్లతామర, రసం పీల్చే పురుగులు ఆశిస్తాయని తెలిపారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున నీటి తడులు అధికంగా ఇవ్వాలని సూచించారు. నత్రజని, భాస్వరం, పోటాషియం ఎరువులను తగు మోతాదులో చెట్లకు అందించాలని అన్నారు. నల్లతామర, రసం పీల్చే పురుగుల వలన మామిడి పిందెలు రాలుతాయని తెలిపారు. దీని నివారణకు ఎకరాకు 40నుంచి 50 నీలి, లేదా తెలుపు జిగురు అట్టలు ఏర్పాటు చేయాలని సూచించారు. వేప నూనె 2, 3 మి.మీ. ఒక లీటర్ నీటిలో పిచికారీ చేయాలని సూచించారు. లేదా.. బవేరియా, బాసియాన 5 గ్రాములు ఒక లీటర్ నీటిలో పిచికారీ చేయాలని సూచించారు. నల్లతామర అదుపులోకి రాకపోతే 2 మి.లీ. ఫిప్రోలిన్, లేక 0.3. మి.లీ. ఇమిడాక్లోపిడ్, లేక 0.3గ్రాముల తయామిథాక్స్ లీటర్ నీటిలో కలిపి రెండు లేదా మూడుమార్లు పిచికారీ చేయాలని సూచించారు.

జర్నలిస్టులకు ఇళ్లు నిర్మించండి

రాజధానిలో ఎమ్మెల్యేలకూ స్థలాలివ్వండి
అసెంబ్లీలో ప్రభుత్వ విప్ కాలవ



రాయదుర్గం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రాల్లో జర్నలిస్టులకు ఇంటి పట్టాలతో పాటు ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు కోరారు. అసెంబ్లీలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో రాజధాని అమరావతి నగరం రాష్ట్రానికి పెద్ద ఆస్తి కాబోతోందని పేర్కొన్నారు. ఈ నగరం అన్ని ప్రాంతాల వారిది అనే భావనను మరింత బలపరిచేలా జర్నలిస్టులతో పాటు ఎమ్మెల్యేలకు నివాస స్థలాలు ఇవ్వాలని కోరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో కూడా అప్పట్లో ఎమ్మెల్యేలకు నివాసస్థలాలు ఇచ్చారని గుర్తు చేశారు. 2014-19లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమక్షంలో సమావేశమై చర్చించామని పేర్కొన్నారు. అప్పట్లో కార్యరూపం దాల్చలేదని, 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో ఈ ప్రతిపాదనలు జగన్ బుట్టదాఖలు చేశారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో అమరావతిలో రాజధాని నిర్మాణ పనులు పునఃప్రారంభమయ్యాయని అన్నారు. రాష్ట్రానికి ప్రధాన ఆకర్షణగా, ఆదాయవనరుగా మారబోతున్న అమరావతిలో జర్నలిస్టులతో పాటు ఎమ్మెల్యేలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కోరారు.

పదెకరాల వరకు రాయితీ వర్తింపజేయాలి

అసెంబ్లీలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి



పుట్టపర్తి రూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లా రైతాంగానికి 10 ఎకరాల వరకు 90 శాతం రాయితీతో వ్యవసాయ పరికరాలను వర్తింపచేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పేర్కొన్నారు. బుధవారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 2014 నుంచి 2019 వరకు నాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో ఉమ్మడి జిల్లాలో 10 ఎకరాల భూమి ఉన్న రైతాంగానికి 90 శాతం రాయితీతో వ్యవసాయ పరికరాలను అందచేయాలని ప్రత్యేక ఉత్తర్వులు ఇచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో రైతాంగం పూర్తిగా అప్పుల్లో కూరుకుపోయిందని తెలిపారు. ఉమ్మడి అనంత జిల్లాలను హార్టికల్చర్‌హబ్‌గా మార్చాలన్న ఉద్దేశంతో సాగుతున్నారని, ఆ దిశగా రైతాంగానికి 90శాతం సబ్సిడీతో, ఎస్సీ ఎస్టీలకు 100 శాతం సబ్సిడీతో ఉద్యానవన పరికరాలను అందించే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు. స్పందించిన మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. రాయలసీమ, ఉమ్మడి జిల్లా రైతాంగ ప్రయోజనాల కోసం కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని పేర్కొన్నారు. రాయలసీమను హార్టికల్చర్‌హబ్‌గా మార్చడమే సీఎం చంద్రబాబునాయుడు లక్ష్యం అన్నారు.

రైతు గోడు పట్టదా..?

సీడ్స్ షాపు ఎదుటే ఆత్మహత్యాయత్నం
నాసిరకం కళింగర విత్తనాలతో నిండా మునిగానని ఆవేదన


ఆరాతీస్తున్న ఏడీ శశికళ

అనంతపురం క్రైం, మార్చి12(ఆంధ్రజ్యోతి): నాసిరకం కళింగర విత్తనాలతో ఓ రైతు నిండా మునిగాడు. ఆరుగాలం శ్రమ, రూ.20 లక్షలు పెట్టుబడి కోల్పోయాడు. సర్వం నష్టపోయి రోడ్డున పడ్డాడు. తనకు వాటిల్లిన మోసంపై విత్తనాలు అమ్మిన షాపు నిర్వాహకులను నిలదీశాడు. వారు పట్టించుకోలేదు. పోలీసు స్టేషన్లలో ఫిర్యాదలు చేసినా.. నిష్ప్రయోజనం. ఆఖరుకు పంచాయితీ చేసి.. రూ.2 లక్షలు చెల్లిస్తామన్న షాపు యాజమాన్యం.. తరువాత చేతులెత్తేసింది. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన రైతు.. విత్తనాల షాపు ఎదుటే పురుగుల మందు తాగాడు. శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం డి.చెర్లోపల్లికి చెందిన మురళి తనకున్న 4.5 ఎకరాల పొలంలో కళింగర పంట సాగు చేయాలనుకున్నాడు. అనంతపురం నగరంలోని ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఉన్న శ్రావణి సీడ్స్ ఎంటర్ ప్రైజెస్‌లో గతేడాది నవంబరు 27న కిలో రూ.50వేల చొప్పున కిలోన్నర విత్తనాలు కొనుగోలు చేశాడు. వాటిని పొలంలో వేశాడు. కంటికి రెప్పలా కాపాడుకున్నాడు. కళింగర కాయలు ఏర్పడ్డాయి. పంట కోసి విక్రయించుకుందామనుకునానడు. కళింగర కాయలు మాగలేదు. లోపల ఎరుపు రంగు ఏర్పడలేదు. 70 రోజులకు పూర్తి కావాల్సిన పంట.. 110 రోజులైనా కాయ తెల్లగానే ఉంది. దీంతో రైతు ఆందోళన చెందాడు. విత్తనాలు కొన్న దుకాణం వద్ద కెళ్లి పరిస్థితి వివరించాడు. వారు పెద్దగా పట్టించుకోలేదని తెలిసింది. బత్తలపల్లి, అనంతపురం వన్‌టౌన్ పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేశాడు. ఎవరూ పట్టించుకోలేదు. రూ.2లక్షల వరకు ఇస్తామని చెప్పిన శ్రావణి సీడ్స్ యాజమాన్యం.. తరువాత చేతులెత్తేసినట్లు తెలిసింది. దీంతో మనస్తాపం చెందిన రైతు మురళి బుధవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో షాపు ఎదుటే పురుగుల మందు తాగాడు. స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రైతును అనంతపురం ఏడీ శశికళ పరామర్శించారు. ఆత్మహత్యకు కారణాలపై ఆరాతీశారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు తెలిపారు.

పట్టించుకోకనే..

ఎవరూ న్యాయం చేయకపోవడంతోనే రైతు మురళి పురుగుల మందు తాగాల్సి వచ్చిందని కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆస్పత్రి వద్ద కుటుంబసభ్యులు మీడియాతో మాట్లాడారు. పంటకు రూ.20 లక్షల వరకు పెట్టుబడి పెట్టామన్నారు. కాయ మూడు కిలోల నుంచి 5కిలోల వరకు బరువు వచ్చిందన్నారు. లోపలి భాగం ఎరుపురంగులోకి మారలేదన్నారు. శ్రావణి సీడ్స్‌లో అడిగితే తమకు సంబంధం లేదనీ, కంపెనీ ప్రతినిధులను అడగాలని చెప్పారన్నారు. ఈ క్రమంలో వన్‌టౌన్, బత్తలపల్లి పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేశామన్నారు. పోలీసులు అక్కడికీ ఇక్కడికీ తిప్పడం తప్ప.. న్యాయం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పరిహారం ఇవ్వాలని కోరితే 'ఏం చేసుకుంటావో... చేసుకోమ'ని షాపు యాజమాన్యం చెప్పడంతో మురళి పురుగుల మందు తాగాడని వారు వాపోయారు.

పకడ్బందీగా పదో తరగతి పరీక్షలు: కలెక్టర్ చేతన్

పుట్టపర్తిటౌన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఈనెల 17నుంచి 31వరకు జరగనున్న పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలని అధికారులను శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. బుధవారం విజయవాడ నుంచి చీఫ్ సెక్రటరీ విజయానంద్‌తో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ.. జిల్లాలో పదో తరగతి పరీక్షలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించడానికి ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. ఈనెల 24, 25 తేదీల్లో విజయవాడలో ముఖ్యమంత్రి నారా చంద్రబబునాయుడు అధ్యక్షతన జరగనున్న కలెక్టర్ల సమావేశానికి స్పష్టమైన ప్రణాళికలతో ఆయా శాఖల అధికారులు నివేదికలు అందించాలన్నారు. శనివారం స్వచ్ఛంధ్రను పటిష్టంగా నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, డీఆర్ఓ విజయసారథి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీపీఓ సమత, పరిశ్రమల శాఖ జీఎం నాగరాజు, జడ్పీ డిప్యూటీ సీఇఓ వెంకటసుబ్బయ్య, నోడల్ అధికారి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో చిన్నారి మృతి


అర్పిత (ఫైల్)

డి.హీరేహాళ్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని మురడి గ్రామానికి చెందిన చిన్నారి అర్పిత (6) బుధవారం విద్యుదాఘాతంతో మరణించింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన తిప్పేస్వామి, రూతమ్మ దంపతులు కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కుమారుడు, నలుగురు కుమార్తెలున్నారు. నాలుగో సంతానమైన అర్పిత గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతుండేది. బుధవారం రోజు మాదిరిగానే పాఠశాలకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికొచ్చింది. ఇంటి బాత్రూంలో విద్యుత్ వైరు తెగిపోయింది. దీంతో బాత్రూం డోర్‌కు విద్యుత్ సరఫరా అవుతుండేది. అర్పిత స్నానం చేసేందుకు బాత్రూంలోకి వెళ్దామని డోర్‌ను తాకగానే విద్యుత్ షాక్ తగిలి కింద పడిపోయింది. కుమార్తె ఎంతసేపటికీ రాకపోవడంతో తల్లి రూతమ్మ బయటకి వచ్చి చూడగా.. కింద పడిపోయి కనిపించింది. రూతమ్మ గట్టిగా అరవడంతో చుట్టుపక్కల వారు వచ్చి చిన్నారిని పక్కకు తీశారు. వారి సాయంతో అర్పితను రాయదుర్గం ఆస్పత్రికి తరలించారు. అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు.

డెంగీతో టీడీపీ కార్యకర్త మృతి


సురేంద్ర (ఫైల్)

చెన్నేకొత్తపల్లి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని న్యామద్దల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త సురేంద్ర(34) డెంగీ జ్వరంతో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. పది రోజుల క్రితం జ్వరంతో బాధపడుతుండడంతో చెన్నేకొత్తపల్లిలో చికిత్సలు చేయించారు. జ్వరం తగ్గకపోవడంతో అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వారంరోజుల క్రితం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ పరీక్షించిన వైద్యులు డెంగీ జ్వరం లక్షణాలు ఉన్నాయని తెలిపారన్నారు. పరిస్థితి విషమించడంతో చికిత్సపొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడన్నారు. మృతుడికి భార్య అశ్విని, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

న్యూస్ బాక్స్

నేటి నుంచి నరసింహస్వామి దిబ్బాల ఉత్సవం

రామగిరి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని గరిమేకల పల్లిలో గురు. శుక్రవారాల్లో లక్ష్మీనరసింహస్వామి, వీర ఓబమ్మ దిబ్బాల మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ పెద్దలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం సాయంత్రం పూల బండ్లు, తాళకావళ్లను అక్కదేవతల దేవాలయానికి చేర్చే కార్యక్రమాలు ఉంటాయన్నారు. శుక్రవారం దిబ్బాల మహాపూజ ఉంటుందన్నారు.

నేటి నుంచి వినికిడి పరీక్షలు

రామగిరి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రామగిరిలో గురువారం నుంచి మూడు రోజుల పాటు దీన్‌దయాళ్ శ్రవణ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా వినికిడి యంత్రాల పంపిణీకి క్యాంప్ నిర్వహిస్తున్నట్లు పరిటాల క్యాంప్ కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. రామగిరిలోని పరిటాల రవీంద్ర ఆడిటోరియల్‌లో ఉచిత క్యాంప్ నిర్వహిస్తారన్నారు. తెల్లరేషన్ కార్డు కలిగిన వారు అర్హులన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి: ఎంపీడీఓ

రాప్తాడు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. ప్రసన్నాయపల్లిలో చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులకు ఎల్‌టీసీ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ ఆనంద్‌ప్రసాద్, సర్పంచ్ శశికళ తదితరులు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.8

అనంతపురం రూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.8తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు బుధవారం 210 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.7, కనిష్ఠ ధర రూ.5 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.24 వేలు

అనంతపురం స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 24,890 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 5,800, సరాసరి రూ. 14వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 176 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

ఎన్టీఆర్ సుజల స్రవంతి ప్లాంటు ప్రారంభం

రామగిరి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపిరెడ్డిపల్లిలో పరిటాల రవీంద్ర మెమోరి యల్ ట్రస్టు సహకారంతో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ సుజల స్రవంతి వాటర్ ప్లాంటును బుధవారం ప్రారంభించారు. టీడీపీ నాయకులు అందరూ కలిసి ప్రారంభించారు. పరిటాల సిద్దార్థ సహకారంతో ఈ ప్లాంటు ప్రారంభించినట్లు తెలిపారు.

మొక్కజొన్న పంటకు నిప్పు


మంటలను ఆర్పేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

గార్లదిన్నె, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొట్టాలపల్లిలో కొండయ్య అనే రైతుకు చెందిన మొక్కజొన్న తోటకు నిప్పంటుకుని కొంతమేర పంట కాలిపోయింది. దంతో రూ. లక్ష వరకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపారు. కొట్టాలపల్లికి చెందిన రైతు కొండయ్య పెనకచెర్లకు వెళ్లే దారి పక్కన ఎనిమిది ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేశాడు. పంటను గురువారం కోయాల్సి ఉంది. అయితే గుర్తు తెలియని వ్యక్తులెవ రో సమీపంలోనే నిప్పు పెట్టడంతో మొక్కజొన్న తోటకు మంటలు వ్యాపించి ఉంటాయని రైతు అన్నాడు. దీంతో పొలంలోని పైపులైన్లు, కొద్దిగా మొక్కజొన్న పంట కాలిపోయిందని తెలిపాడు. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు సమయానికి రావడంతో మంటలను త్వరగా ఆదుపు చేశారని, దీంతో పెద్ద ప్రమాదం తప్పిందని కొండయ్య తెలిపాడు.

బైకు ఆదుపుతప్పి ఒకరికి గాయాలు

గార్లదిన్నె, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్తాడు గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనం ఆదుపుతప్పి ఒకరికి గాయాలయ్యాయి. మండలకేంద్రమైన పామిడికి చెందిన శివ కుమార్ మర్తాడులో జరుగుతున్న తాతార్యారూఢస్వామి తిరునాళ్లకు ద్విచక్రవాహనంలో వచ్చి తిరిగి వెళుతున్నాడు. మర్తాడు సమీపంలో ద్విచక్ర వాహనం ఆదుపుతప్పి శివ కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని 108 వాహనం ద్వారా అనంతపురం ప్రభుత్వం ఆస్పత్రికి తరలించారు.

'24 గంటలూ వైద్యసేవలు అందిస్తాం'

శింగనమల, మార్చి 12(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో రోగులకు 24 గంటటూ వైద్యులు అందుబాటులో ఉండి, వైద్యసేవలు అందజేస్తామని ఆసుపత్రి వైద్యాధికారి రోహినాథ్ పెర్కొన్నారు. ఆయన బుధవారం కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ వైద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. వైద్య సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. వైద్యులు చంద్రకళ, రంగనాయకులు పాల్గొన్నారు.

ఎస్కేయూ మాజీ ప్రొఫెసర్‌కు సత్కారం

అనంతపురం సెంట్రల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పరిశోధనల ప్రతిభకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపునిచ్చే రాయల్ సొసైటీ అవార్డును ఎస్కేయూ మాజీ ప్రొఫెసర్ శుభ అందుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత, రిజిస్ట్రార్ రమేష్‌బాబు, పీర్వో ప్రొఫెసర్ రామగోపాల్ మాజీ ప్రొఫెసర్ శుభ దంపతులను సత్కరించారు.

బాల్య వివాహంపై కేసు

అనంతపురం క్రైం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): నగరంలో జరిగిన బాల్య వివాహంపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. రాజమ్మ కాలనీకి చెందిన ఓ బాలికకు, కళ్యాణదుర్గం రూరల్ మండలానికి చెందిన యువకుడితో ఈ నెల 9న వివాహమైంది. ఈ వివాహంపై 15వ వార్డు సచివాలయ సిబ్బంది ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదుచేశారు.

ఇన్‌స్టాగ్రామ్ పరిచయం... వివాదం

అనంతపురం క్రైం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూనివర్సిటీలో చదువుతున్న ఓ విద్యార్థినికి ఇన్‌స్టాగ్రామ్‌లో తిరుపతి పాల డెయిరీలో పనిచేసే ఓ అబ్బాయి పరిచయమయ్యాడు. కొంతకాలం బాగానే మాట్లాడుకున్నారు. తాజాగా 10 రోజుల క్రితం ఏం జరిగిందో కానీ ఆ అమ్మాయి అతడి నంబర్‌ను డిలీట్ చేసింది. ఫోన్‌లోనూ మాట్లాడటం లేదు. దీంతో ఆ అబ్బాయి బుధవారం యూనివర్సిటీ వద్దకు వచ్చి గొడవకు దిగాడు. దీంతో ఆ అమ్మాయి ఇటుకలపల్లి పోలీసుల దృష్టికి తీసుకెళ్లింది. పోలీసులు అతడికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు.

డ్రంకెన్ డ్రైవ్‌కు భారీ జరిమానా

అనంతపురం క్రైం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): తాగి వాహనం నడిపి.... పోలీసులకు చిక్కితే అంతే సంగతులు. కొత్త నిబంధన లు అమలవుతున్నాయి. అనంతపురం ట్రాఫిక్ పోలీసులు మంగళ వారం ఆరు డ్రంకెన్ డ్రైవ్ కేసులు కట్టారు. మొబైల్ కోర్టులో హాజరు పరచగా... ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున ఆరుగురికి రూ.60వేలు జరిమానా వేశారు.

ఆలయాల అభివృద్ధికి సహకరించండి

● దేవదాయ శాఖ మంత్రికి ఎమ్మెల్యే శ్రావణిశ్రీ వినతి


మంత్రికి వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

శింగనమల/ బుక్కరాయసముద్రం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పురాతనమైన దేవాలయాల అభివృద్ధితో పాటు గూగూడును పుణ్యక్షేత్రంగా, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి నిధులు కేటాయించాలని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రాం నారాయణరెడ్డికి ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే బుధవారం అసెంబ్లీ సమావేశాల అనంతరం మంత్రిని ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. నియోజకవర్గంలోని నార్పల మండలంలో ఉన్న గూగూడు కుళ్లాయిస్వామి ఉత్సవాలకు నాలుగు రాష్ట్రాల (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు) నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి, మొక్కులు తీర్చుకుంటారని తెలిపారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సౌకర్యాలు కల్పించాలన్నారు. గూగూడుకు పర్యాటక ప్రాంతంగా పుణ్యక్షేత్రంగా గుర్తింపు ఇవ్వాలన్నారు. అలాగే శింగనమల మండలంలోని పురాతన చరిత్ర కలిగి రుషింగమయ్య వెలసిన కొండపైకి సీసీ రోడ్డు వేసి, అక్కడి రుష్యశృంగ మునీశ్వర దేవాలయం అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని కోరారు. బుక్కరాయసముద్రంలో అతి పురాతణమైన దేవరకొండ మీద వెలిచిన కొండమీద రాయుడు దేవాలయాన్ని పర్యాటక రంగం గుర్తించి, కొండపై టీటీడీ కల్యాణమండపంతో పాటు మౌలిక సదుపాయాల కల్పన కోసం నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవలే కొండపైన అరుణాచలం తరహాలో జ్యోతిని వెలిగించామని, వచ్చే ఏడాదికి ఈ కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహించే విధంగా చొరవ చూపాలని మంత్రిని కోరారు. వైసీపీ పాలనలో సమీపంలోని ఆ దేవాలయ భూమి ఆక్రమణకు గురైందన్నారు. దానిని స్వాధీనం చేసుకుని, భక్తుల గిరి ప్రదక్షిణకు సౌకర్య కల్పించాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే తెలిపారు. వీటిపై మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

చెన్నకేశవాలయాన్ని పూర్తి చేయండి

● మంత్రికి ఎమ్మెల్యే పరిటాల సునీత, భోగినేపల్లి వాసుల వినతి


మంత్రికి విన్నవిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, బోగినేపల్లి వాసులు

రాప్తాడు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోగినేపల్లిలో నిధులులేక ఆగిపోయిన లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డిని కోరారు. ఎమ్మెల్యే పరిటాల సునీత, బోగినేపల్లి గ్రామస్థులు బుధవారం విజయవాడలో దేవాదాయశాఖ మంత్రిని కలిశారు. భోగినేపల్లిలోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ నిర్మాణానికి రూ.1. 60 కోట్లతో అంచనా వేశారన్నారు. ఇందులో గ్రామస్థు లు 20 శాతం, ప్రభుత్వం నుంచి సీజీఎఫ్ నిధులు 80 శాతం చెల్లించేలా నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. అయితే గ్రామస్థులు రూ. 20 లక్షలు ఇవ్వగా, సీజీఎఫ్ నుంచి రూ.50 లక్షలు మాత్రమే వచ్చిందన్నారు. దీంతో ఆలయ నిర్మాణం పూర్తి కాలేదన్నారు. ఆలయ నిర్మాణం పూర్తి కావాలంటే మరో రూ.కోటి అవసరమన్నారు. ఆలయ నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పరిటాల సునీత కూడా మంత్రికి విజ్ఞప్తి చేశారు. అయితే సీజీఎఫ్ నిధులు ఒక్కసారి వచ్చిన తరువాత మళ్లీ ఇవ్వడానికి వీలుండదని, సహకరిస్తామని మంత్రి ఆనం హామీ ఇచ్చినట్లు సర్పంచ్ ఉజ్జినప్ప, టీడీపీ నాయకులు నారా నారాయణ, శివయ్య, నారాయణ స్వామి, ప్రసాద్, గ్రామస్థుడు భాస్కర్‌రెడ్డి తదితరులు తెలిపారు.

మొల్ల జయంతిని విజయవంతం చేయండి

● టీడీపీ కుమ్మర, శాలివాహన సమితి రాష్ట్ర కన్వీనర్

అనంతపురం అర్బన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో గురువారం ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే కవయిత్రి మొల్లమాంబ జయంతిని విజయవంతం చేయాలని టీడీపీ కుమ్మర, శాలివాహన సమితి రాష్ట్ర కన్వీనర్ పోతులయ్య బుధవారం ఒక ప్రకటనలో కోరారు. కలెక్టర్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి పార్టీలకు అతీతంగా ఉమ్మడి అనంత జిల్లాలోని కుమ్మర, శాలి వాహన కులస్థులు, మహిళలు, యువత పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు.

'ఫీజులు ఎగ్గొట్టిన వారే ధర్నాలు చేయడమా?'

కనగానపల్లి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సంబంధించిన కాలేజీ ఫీజ్‌లు ఎగ్గొట్టినవారే నేడు దర్నాలు చేయడం విడ్డూరంగా ఉందని టీఎన్ఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు మల్లెల చైతన్య విమర్శించారు. ఈ మేరకు ఆయన బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వైసీపీ ఆధ్వర్యంలో చేపట్టిన యువత పోరు కార్యక్రమంపై మండిపడ్డారు.

ఘనంగా ఐద్వా ఆవిర్భావ వేడుకలు

అనంతపురం కల్చరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) 44వ ఆవిర్భావ దినోత్సవాలను బుధవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ఇందిరానగర్, గణేనాయక్ కాలనీ, మల్లు స్వరాజ్యం కాలనీ తదితర ప్రాంతాల్లో ఐద్వా జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి మాట్లాడుతూ... ప్రభుత్వాలు మహిళలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసేందుకు ఆందోళనలు చేయాల్సిన అవసరముం దన్నారు. ఐద్వా జిల్లా నాయకురాళ్లు శ్యామలమ్మ, చంద్రిక, అశ్విని, నగర నాయకులు ఫిర్యాది, భాగ్యమ్మ, సునంద తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తు కోసం పనిచేయాలి : ఆర్జేడీ

అనంతపురం సెంట్రల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కళాశాలలోని విద్యార్థుల కు మంచి భవిష్యత్ అందించేలా పనిచేయాలని కాలేజియేట్ ఆర్జేడీ నాగలింగారెడ్డి డిగ్రీ లెక్చరర్లకు సూచించారు. బుధవారం ఆర్ట్స్ కళాశాలను ఆర్జేడీ అకస్మికంగా సందర్శించారు. ప్రిన్సిపాల్ పద్మశ్రీ అధ్యక్షతన లెక్చరర్లతో సమీక్షించారు. అనంతరం విద్యార్థి సంఘాల నాయకులు ఆయన్ను కలిసి డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు.

సొమ్ము దారి మళ్లింపులో మా ప్రమేయం లేదు

● జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు

అనంతపురం న్యూటౌన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): అటవీ శాఖ అనంతపురం రేంజ్ పరిధిలో కంప్యూటర్ ఆపరేటర్ నకిలీ చలానాలతో దారిమళ్లించిన సొమ్ము నుంచి సిబ్బందికి విముక్తి కల్గించాలని జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు డీఎఫ్ఓ విఘ్నేష్‌ను కలిసి విన్నవించారు. వారు బుధారం డీఎఫ్ఓ కార్యాలయంలో డీఎఫ్ఓ విఘ్నేష్‌ను కలిశారు. దీంతో స్పందించిన ఆయన మొత్తం సమాచారం తన వద్ద ఉంద ని, ప్రజల సొమ్ము దుర్వినియోగం కావడానికి వీలులేదన్నారు. దారి మళ్లిన సొమ్మును రాబట్టడానికి తగిన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. యూనియన్ నాయకులు మారేప్ప, నీలవేణి, నారపరెడ్డి, రామచంద్రారెడ్డి, సూర్యనారాయణ, తేజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి ఇంటిపై వైసీపీ మూకల దాడి


బైకును ధ్వంసం చేసిన దృశ్యం

ఆత్మకూరు, మార్చి12(ఆంధ్రజ్యోతి): తన ఇంటిపై బుధవారం రాత్రి వైసీపీ మూకలు దాడి చేశారని, దీనిపై ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు మండలంలోని పి. సిద్దరాంపురానికి చెందిన డీలర్ నారాయణస్వామి తెలిపారు. పదిరోజులు క్రితం జరిగిన చిన్నపాటి గొడవను దృష్టిలో ఉంచుకొని వారు దాడికి పాల్పడినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. దాడికి వచ్చిన సమయంలో ఇంటి ఎదుట ఉన్న ద్విచక్రవాహనాన్ని ధ్వంసం చేశారన్నారు. ఆ పార్టీనాయకులు పెద్ద ఎత్తున ఇంటి వద్దకు తరలివచ్చి ఇంటి ఎదుట ఉన్న మరికొన్ని వస్తువులను ధ్వంసం చేసినట్లు అతడు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసునమోదు చేసి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

చెరువుల్లో చేపపిల్లల విడుదల

శింగనమల, మార్చి 12(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రం సమీపంలోని శ్రీరంగరాయ చెరువులో సబ్సిడీ చేప పిల్లలను వదిలారు. పీఎంఎంఎస్‌వై పథకం కింద బుధవారం చెరువులో రూ. 3లక్షలు విలువైన సబ్సిడీ చేప పిల్లలను తహసీల్దార్ సాకే బ్రహ్మయ్య మత్స్యశాఖ ఎఫ్‌డీఓ ఫక్కీరయ్య చేతుల మీదుగా వదిలారు. ఆయకట్టు సంఘం అధ్యక్షుడు గార్లదిన్నె సత్యనారాయణ, మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షుడు నగేష్, చెరువు మత్స్యకార సంఘం అధ్యక్షుడు వెంకటనారాయణ, సభ్యులు పాపారాయుడు, చిరంజీవి, ఫక్కీరప్ప, మత్స్యకారులు అక్బర్, రామాంజి, సంజీవులు తదితరులు పాల్గొన్నారు.

● బుక్కరాయసముద్రం: మత్సకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ దాసరి సునీత అన్నారు. మండల కేంద్రంలోని బుక్కరాయసముద్రం చెరువులో బుధవారం ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద 1.46 లక్షల చేపపిల్లలును వదిలారు. ఎంపీపీతో పాటు జిల్లా మత్స్యశాఖ డీడీ శ్రీనివాసునాయక్, మత్స్యశాఖ సంఘం జిల్లా అధ్యక్షుడు మండ్ల నాగేష్ పాల్గొన్నారు.

జూన్ నాటికి మొక్కలు పంపిణీ చేయాలి

● జిల్లా అటవీ శాఖాధికారి విఘ్నేష్

అనంతపురం న్యూటౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): అటవీశాఖ ఆధ్వర్యంలో ఉన్న నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను జూన్ నాటికి పంపిణీ చేసేలా చూడాలని రేంజర్ శ్రీనివాసులుకు జిల్లా అటవీ శాఖాధికారి విఘ్నేష్ సూచించారు. ఆయన బుధవారం రేంజర్ శ్రీనివాసులు, సెక్షన్ ఆఫీసర్ అక్బర్, బీట్ ఆఫీసర్ నీలవేణితో కలిసి కూడేరు నర్సరీని పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎత్తుగా పెరిగే మొక్కలకు నర్సరీల్లో ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. వాటి సంరక్షణకు ఇబ్బందులు ఉండవన్నారు. మరుట్ల సౌత్ బీట్‌లో 20 హెక్టార్లలో పెంచుతున్న మొక్కలను ఆయన పరిశీలించారు.

సాంకేతిక రంగంలో మహిళలు మేటి: వీసీ


వేడుకలను ప్రారంభిస్తున్న వీసీ సుదర్శనరావు


నృత్యం చేస్తున్న విద్యార్థిని

అనంతపురం సెంట్రల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): సాంకేతిక రంగంలో పురుషులతోపాటు మహిళలు మేటిగా రాణిస్తున్నారని జేఎన్టీయూ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకుని బుధవారం జేఎన్టీయూ ఎన్టీఆర్ ఆడిటోరియంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉమెన్ ఎంప వర్‌మెంట్ సెల్ డైరెక్టర్ వీబీ చిత్ర, కోఆర్డినేటర్ అజిత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకలకు వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు, ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ అనిత, జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. విద్యార్థుల సాంస్కృ తిక కార్యక్రమాలు అలరించాయి. డైరెక్టర్లు వైశాలి గోర్పాడే, సుజాత, కిరణ్మయి, పద్మసువర్ణ, వైస్ ప్రిన్సిపాల్ మాధవి దతితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో నిలిచిపోయిన నిర్మాణాలు

శింగనమల, మార్చి 12(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన శింగనమల ఎస్సీ కాలనీకి సంబంధించిన దళిత శ్మశాన వాటిక ప్రహరీ, భవనం పనులు గత వైసీపీ ప్రభుత్వంలో అర్ధంతరంగా నిలిచిపోయాయి. కాలనీ వాసులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. శింగనమల ఎస్సీ కాలనీ శ్మశాన వాటికకు వైసీపీ ప్రభుత్వంలో చుట్టూ ప్రహరీ, భవనం నిర్మాణానికి ఎంపీ నిధులు రూ.12 లక్షలు, ఏఆర్‌జీసీ నిధులు రూ.7 లక్షలు చొప్పున మొత్తం రూ.19 లక్షలు కేటాయించారు. వీటితో అక్కడ కాంట్రాక్టర్లు పనులు చేపట్టారు. అందులో ఇప్పటి వరకు రూ.17 లక్షల బిల్లులు మంజూరైనట్లు రికార్డులు చెబుతున్నాయి. అక్కడ భవన నిర్మాణం కేవలం టాప్ దశలోనే నిలిచిపోయింది. ప్రహరీని సగం వరకు కట్టి వదిలేశారు. ఎస్సీ కాలనీవాసులు మృతి చెందితే శ్మశాన వాటికలో పూడ్చడానికి వీలు లేకుండా కంపచెట్లు పెరిగాయి. మంజూరు చేసిన రూ. 19 లక్షల్లో రూ.17 లక్షలు ఖర్చు చేసినా ప్రహరీ, భవనం ఆ మేరకు కూడా పూర్తికాకపోవడం ఏమిటని కాలనీ వాసులు ప్రశ్నిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ స్పందించి తమ కాలనీకి చెందిన శ్మశాన వాటిక పనులు పూర్తి చేయించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



ఎస్సీ కాలనీ శ్మశాన వాటికలో అర్ధంతరంగా ఆగిపోయిన భవనం, ప్రహరీ నిర్మాణాలు

శిలాఫలకాలు మార్చడం సరికాదు

● చట్ట పరిధిలో అధికారులే బాధ్యులవుతారు
● టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం


మాట్లాడుతున్న వైకుంఠం ప్రభాకర్ చౌదరి

అనంతపురం మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : రాజకీయంగా కొన్ని సంప్రదాయాలు ఉంటాయని, ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా... శిలాఫలకాలను ఏర్పాటు చేసే సందర్భంలో రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధులు, సభ్యుల పేర్లు చేర్చడం అనవాయితీ అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి అన్నారు. అలా కాకుండా శిలాఫలకాలను మార్చడం సరికాదన్నారు.ఆయన బుధవారం నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... నగరంలో దురదృష్టవశాత్తు గతంలో ఎన్నడూ లేని విధంగా వింత పోకడలు జరుగుతున్నాయన్నారు. తాను మున్సిపల్ చైర్మన్‌గా ఎంపికైన సమయంలో సప్తగిరి సర్కిల్ సమీపంలోని ప్రాంతాన్ని వినాయక చౌక్‌గా, మరో సర్కిల్‌ని చాందిని సర్కిల్‌గా ఆయా వర్గాలు పేరు పెట్టుకున్నారన్నారు. తాను అప్పట్లో ఆయా కమిటీ సభ్యులను ఒప్పించి, వినాయక చౌక్‌ను బాలగంగాధర్ తిలక్ సర్కిల్‌గా, చాందిని చౌక్‌కు అబుల్ కలామ్ అజాద్ పేరు పెట్టామన్నారు. అలాగే ముస్లిం మైనార్టీ నాయకులతో కమిటీని ఏర్పాటు చేసి, విగ్రహాన్ని ఏర్పాటు చేశామన్నారు. నేషనల్ హైవే నిర్మాణంలో భాగంగా నగరంలోని పలు విగ్రహాలను తొలగించారన్నారు. తాను మానవతావాదిగా కలెక్టరేట్ ఎదుట ఫాదర్ ఫెర్రర్ విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేశానన్నారు. రోడ్డు పనులు పూర్తి కాగానే మిగిలిన విగ్రహాలను నిర్దేశించిన ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తామని అప్పట్లో సంబంధిత అధికారులు చెప్పారని గుర్తు చేశారు. అయితే ఈ మధ్య కాలంలో ఆగమేఘాలపై అబుల్ కలామ్ ఆజాద్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని, అయితే ఆర్‌అండ్‌బీలో పాత శిలాఫలకాలు ఉన్నప్పటికీ కొత్త పేర్లతో శిలాఫకలాన్ని ఏర్పాటు చేశారన్నారు. దీనిపై ఓ ముస్లిం కమిటీ సభ్యుడు ఆర్ అండ్‌బీ అధికారులకు లేఖరాసినా, నగర పాలక సంస్థ అధికారులను తాము ప్రశ్నించినా సరైన సమాధానం లేదన్నారు. గడచిన దశాబ్దాల కాలంలో ఇలాంటి సంఘటనలు జరగలేదన్నారు. తాను ఒక పార్టీలో క్రమశిక్షణతో ఉన్నందున మౌనం వహిస్తున్నానన్నారు. లేని పక్షంలో ప్రజా సంఘాలను కలుపుకొని నగరపాలక సంస్థ కార్యాలయాన్ని ముట్టడించగలమని అధికారులకు స్పష్టం చేశానన్నారు. ఈ వ్యవహారంపై విగ్రహ ఏర్పాటు కమిటీ సభ్యుల ద్వారా హైకోర్టును ఆశ్రయించామని, 60 రోజుల్లోపు పాత శిలాఫకలాలను తిరిగి ఏర్పాటు చేయాలని, లేదంటే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని సంబం ధిత అధికారులకు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఇప్పటికే 60 రోజుల సమయం పూర్తి అయిందన్నారు. అధికారులు చొరవ తీసుకొని జరిగిన తప్పును సరిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. లేని పక్షంలో హైకోర్టులో కోర్టు ధిక్కరణ కేసు వేయాల్సి వస్తుందని ఆయన స్పష్టం చేశారు.

భారత్ పారా అథ్లెటిక్ జట్టు కోచ్‌గా జిల్లా వాసి


సురేష్‌కుమార్

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో గురువారం నిర్వహించే జాతీయ స్థాయి న్యూఢిల్లీ పారా అథ్లెటిక్ గ్రాండ్ ప్రిక్‌లో పాల్గొం టున్న భారత్ పారా అథ్లెటిక్ జట్టుకు కోచ్‌గా జిల్లా వాసి సురేష్‌కుమార్ నియ మితులయ్యారు. ఇప్పటికే సురేష్‌కుమార్ ఢిల్లీలో భారత పారా జట్టు శిక్షణాశిబిరంలో పాల్గొంటున్నారు. ఢిల్లీలోని జవహర్‌లాల్ అథ్లెటిక్స్ క్రీడామైదానంలో పోటీలు జరగనున్నాయి.

జాతీయ ఫెన్సింగ్ పోటీలకు జిల్లా వాసుల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఖేలో ఇండియా ఫెన్సింగ్ జాతీయ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. ఎంపికైన సీనియర్ బాలురలో కృష్ణ, మోహిత్‌రావు, ప్రభ ఆదిత్యభూషణ్, జూనియర్స్‌లో ధోని హరి హరసింగ్ ఉన్నారు. బాలికల్లో జ్యోష్ణవి బాయి, అమృత, వందన ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులు శుక్రవారం నుంచి కేరళలోని ఎర్నాకులంలో నిర్వహించే జాతీయస్థాయి ఖేలో ఇండియా ఫెన్సింగ్ పోటీలకు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఎంపికైన క్రీడాకారులు, కోచ్ లక్ష్మీదేవిని డీఎస్‌డీఓ ఉదయ్‌భాస్కర్ అభినందించారు.

22 నుంచి ఏఐటీయూసీ శిక్షణా తరగతులు

● జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి

అనంతపురం విద్య, మార్చి 12(ఆంధ్రజ్యోతి): నగరంలో ఈ నెల 22, 23 తేదీల్లో ఏఐటీయూసీ జిల్లా శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి తెలిపారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆ సంఘం జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ.. నగర శివారులోని ఓ ప్రైవేట్ గార్డెన్‌లో ఈ శిక్షణా తరగతులు ఉంటా యన్నారు. రెండు రోజులపాటు సాగే కార్యక్రమాలకు రాష్ట్ర నాయక త్వం, మేధావి వర్గం హాజరవుతారన్నా రు. ఏఐటీయూసీ నాయకులు, యువత పెద్దఎత్తున హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో ఆసంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణుడు, ఇతర నాయకులు చిరంజీవి, తిరుమలయ్య, రాజు, నాగమణి, మనోహర్, నాగేంద్ర, శివకృష్ణ, తిరుమలయ్య, ఎర్రప్ప, అక్బర్ బాషా పాల్గొన్నారు.

పరిశుభ్రతపై దృష్టి సారించాలి : డీపీఓ

అనంతపురం న్యూటౌన్, మార్చి12 (ఆంధ్రజ్యోతి) జిల్లాలోని పంచాయతీల్లో పరిశుభ్రతపై కార్యదర్శులు దృష్టి సాధించాల్సిన అవసరం ఎంతైన ఉందని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజనాయుడు సిబ్బందికి సూచించారు. ప్రసన్నాయనపల్లి పంచాయతీలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద ఆయన బుధవారం పంచాయతీ సిబ్బందితో సమావేశమయ్యారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన తీసుకొచ్చేలా వారికి శిక్షణ ఇచ్చారు. ఈఓఆర్డీ ఆనంద్, పలువురు పంచాయతీ కార్యదర్శులు, డీపీఆర్‌సీ జిల్లా కో-ఆర్డినేటర్‌తో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రుణ విముక్తులకు పట్టాల పంపిణీ

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 2008 సంవత్సరంలో ల్యాండ్ పర్చేజింగ్ స్కీమ్ కింద భూములు పొందిన లబ్ధిదారులకు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ పట్టాలను అందజేశారు. ఈ మేరకు బుధవారం ఎస్సీ కార్పొరేషన్‌లో రుణ విముక్తులైన ఏడుగురికి పత్రాలను అందజేశారు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం మండలం కుణుతూరుకు చెందిన ఏడుగురికి పట్టాలను అందజేశారు.

సంక్షిప్త వార్తలు

భూవివాదంపై పోలీసులకు ఫిర్యాదు

యాడికి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రాయలచెరువులో భూవివాదంపై మాదాల భాస్కర్ అనే వ్యక్తి బుధవారం మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సర్వేనెంబరు 650/బీ, సీ, డీ, ఈ, ఎఫ్‌లో 1.25ఎకరాల భూమి తన తల్లి నాగలక్ష్మి పేరున ఉందని, కాగా ఈనెల 11వ తేదీన సుమారు 10వాహనాల్లో 60మంది వ్యక్తులు వచ్చి తన స్థలంలో బాడుగకు ఉన్న వ్యక్తులను బెదిరించి, వారి వస్తువులను బయటకు విసిరేశారని, స్థలానికి సంబంధించి వారివద్ద ఎటువంటి ఆధారాలు లేకపోయినా దౌర్జన్యానికి దిగారని భాస్కర్ ఫిర్యాదులో పేర్కొన్నారు. వారిని అడ్డుకోవడానికి వెళ్లిన తనపైనా, తన బంధువులపైన దాడికి ప్రయత్నించారని తెలిపారు. దౌర్జన్యానికి దిగిన వారిపై కేసు నమోదుచేసి తగు చర్యలు తీసుకోవాలని ఆయన ఫిర్యాదులో కోరారు. ఫిర్యాదు చేయడానికి రాయలచెరువు గ్రామస్థులు పెద్దఎత్తున పోలీస్‌స్టేషన్ వద్దకు రావడం గమనార్హం.

నవోదయం 2.0పై అవగాహన

బెళుగుప్ప, మార్చి 12(ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని ఎర్రితాత ఆలయం వద్ద, బెళుగుప్ప తండాలోనూ ప్రజలకు బుధవారం ఎక్సైజ్ అధికారులు నవయుగం 2.0పై అవగాహన సదస్సులు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు శ్రీరామ్, రేవతి పాల్గొని మాట్లాడారు. నాటుసారాతో బతుకులన్నీ చిన్నాభిన్నమవుతాయన్నారు. నాటు సారా తయారీ మానుకోవాలని సూచించారు. మీలో మార్పు తీసుకురావాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈ అవగాహన సదస్సులు నిర్వహిస్తోందని చెప్పారు. ఇక నుంచైనా సారా తయారు చేయడం మానుకోవాలన్నారు. లేకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తర్వాత వారితో నాటుసారా జోలికి వెళ్లమని ప్రతిజ్ఞ చేయించారు. సర్పంచ్ సలీబాయి, సీఐలు జయవర్ధన్‌రెడ్డి, కృష్ణమూర్తి, ఆంజనేయులు, ఎర్రిస్వామి, సెక్రెటరీ రవి తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలంటే భయం వీడాలి

శెట్టూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పరీక్షలంటే భయం వీడాలని, ప్రశాంతంగా పరీక్షలు రాస్తే.. మంచి మార్కులు సాధించొచ్చని మానసిక వైద్య నిపుణుడు గురుబాలాజీ, ఎంఈఓ వాణిదేవి టెన్త్ విద్యార్థులకు సూచించారు. మండలంలోని లక్ష్మంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో బుధవారం ఎస్ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో టెన్త్ విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన సదస్సు జరిగింది. మానసిక వైద్య నిపుణుడు, ఎంఈఓ పాల్గొని మాట్లాడారు. రాబోయే పబ్లిక్ పరీక్షలను విద్యార్థులు ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. ఎటువంటి ఒత్తిడికి లోనుకాకూడదని చెప్పారు. ఉదయాన్నే యోగా, కొద్దిపాటి వ్యాయామాలు చేయడం వల్ల మానసిక ప్రశాంతత ఏర్పడుతుందని తెలిపారు. తద్వారా పరీక్షలను బాగా రాయొచ్చని సూచించారు. తర్వాత విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ఎస్ఆర్ సొసైటీ అధ్యక్షుడు సుంకర రమేష్, కార్యదర్శి ప్రసిల్లా, క్లస్టర్ చైర్‌పర్సన్ లక్ష్మీ శిరీష, హెచ్ఎం సిరాజుద్దీన్ ,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ


పెద్దవడుగూరులో పంపిణీ చేస్తున్న దివాకర్‌రెడ్డి

పెద్దవడుగూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన టెన్త్ విద్యార్థులకు తెలుగుయువత ఆర్గనైజింగ్ జిల్లా సెక్రటరీ దివాకర్‌రెడ్డి పరీక్షల సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి ఆదేశాల మేరకు పెన్నులు, అట్టలు పంపిణీ చేశామన్నారు. సుమారు 300మంది విద్యార్థులకు అందించినట్లు చెప్పారు. టీడీపీ నాయకులు గంగరాజు, నాగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: మండలంలోని తిమ్మాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పదో తరగతి విద్యార్థులకు జీఆర్పీ కానిస్టేబుల్ రామాంజనేయులు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. హెచ్ఎం నారాయణరెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీపై శిక్షణ

కణేకల్లు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దిగువగేరిలో ఉన్న చెత్తతో సంపద తయారీ కేంద్రంలో బుధవారం కణేకల్లు, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గంలోని పలువురు పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. డీటీఆర్సీ కో ఆర్డినేటర్ సౌజన్య హాజరై గ్రామపంచాయతీలలో సేకరించిన చెత్త నుంచి సంపద ఎలా సృష్టించాలో అనే అంశంపై శిక్షణ ఇచ్చారు. రీసోర్స్ పర్సన్‌లు నాగేంద్ర, గంగిరెడ్డి హాజరై ప్రతిరోజూ ఆయా పంచాయతీల్లో వంద కిలోలు చెత్తను సేకరిస్తే ఎలాంటి ఆదాయం వస్తుందన్న విషయాలను వివరించారు.

ఘనంగా మహిళా దినోత్సవం

కుందుర్పి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఏఎఫ్ ఎకాలజీ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా మహిళలు స్థానిక ప్రధాన వీధుల్లో పెద్దఎత్తున ర్యాలీ చేపట్టారు. అనంతరం సమావేశం ఏర్పాటు చేయగా.. ముఖ్యఅతిథులుగా సర్పంచ్ మారుతేశ్వరి, రిషి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అరుణ, ఏఎఫ్ఏ కాలేజీ సీపీవో ప్రియాంక తదితరులు హాజరై మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. పురుషుల కన్నా తామేమీ తక్కువ కాదని నిరూపించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎఫ్ ఎకాలజీ సంస్థ సిబ్బంది, కెనరా బ్యాంకు మేనేజర్ జ్యోతిర్మయి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

రాయదుర్గం రూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): విధుల నిర్వహణ పట్ల నిర్లక్ష్యంగా ఉండడంతో ఇద్దరు సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు డీఎల్‌డీఓ నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని బీఎన్‌హళ్లి సచివాలయాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి రికార్డులను పరిశీలించారు. జూనియర్ లైన్‌మన్ త్రినాథ్‌నాయక్, హార్టికల్చర్ అసిస్టెంట్ కార్తీక్ విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్నట్లు తేలడంతో షోకాజ్ నోటీసులు జారీ చేశారు. 12 రకాల సర్వేలు నిర్వహించడంలో ఈ ఉద్యోగులు నిర్లక్ష్యం వహించారని, అందుకే షోకాజ్ నోటీసులు ఇచ్చామని డీఎల్‌డీఓ తెలిపారు. వారిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

సాంకేతికతతో నేరాల నియంత్రణ: డీఎస్పీ


కళ్యాణదుర్గంలో డ్రోన్ వినియోగంపై వివరిస్తున్న డీఎస్పీ రవిబాబు

కళ్యాణదుర్గం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): సాంకేతికతను ఉపయోగించుకుని నేరాలను నియంత్రించేందుకు అవకాశం ఉంటుందని డీఎస్పీ రవిబాబు తెలిపారు. ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు పట్టణంలోని మోడల్ స్కూల్ ఆవరణలో బుధవారం ఆయన డ్రోన్ కెమెరాల పనితీరుపై స్థానిక పోలీసులకు అవగాహన కల్పించారు. డ్రోన్ కెమెరాలను ఏ విధంగా ఉపయోగించుకోవాలో ప్రయోగాత్మకంగా వివరించారు. సుదూర ప్రాంతాలలో జరిగే జాతరలో కానీ, ఇతరత్రా వేడకల్లో కానీ ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా డ్రోన్ కెమెరాలు ఎలా వాడాలో క్షుణంగా వివరించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ యువరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్: నియోజకవర్గంలోని పోలీస్‌స్టేషన్ల పరిధిలోని పోలీసులకు డ్రోన్ వాడకంపై అవగాహన కల్పించినట్లు అర్బన్ సీఐ జయనాయక్ తెలిపారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్ వద్ద సిబ్బందికి డ్రోన్ వాడకంపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించామని అన్నారు. ఎస్ఐలు నబీరసూల్, ఈశ్వరయ్య, ఐదు మండలాల పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

అరటి మొక్కలకు నీడ కోసం..

● ఎండ నుంచి కాపాడటానికి ఈతాకు పట్టలతో సంరక్షణ

బెళుగుప్ప/ కూడేరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వేసవి ప్రారంభమై ఎండలు మండుతున్నాయి. ఈ ఎండ వేడిమి నుంచి అరటి (పిలకలు) మొక్కలను కాపాడుకునేందుకు రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. రాబోవు రెండు నెలలపాటు మొక్క ఎండిపోకుండా చూసుకుంటే పంటను దక్కించుకోవచ్చన్న ఆశతో ఎంతో శ్రమిస్తున్నారు. మొక్క ఎండిపోకుండా ఈతఆకు పట్టలతో నీడ కల్పిస్తూ సస్య రక్షణ చర్యలు చేపడుతున్నారు. బెళుగుప్ప మండలం దుద్దేకుంటకు చెందిన రైతు శివకుమార్, కూడేరు మండలం ముద్దలాపురం గ్రామానికి చెందిన దేవేంద్ర వివిధ ప్రాంతాలకు వెళ్లి ఈతఆకు పట్టలను కొనుగోలు చేసి తెచ్చి మరీ ప్రతిమొక్క వద్ద నాటి నీడ ఏర్పాటు చేశారు.


ఈత పట్టల నీడలో అరటి మొక్క


బెళుగుప్ప మండలం దుద్దేకుంటలో అరటి పిలకల వద్ద ఈత పట్టలు ఏర్పాటు చేస్తున్నరైతు కుటుంబం


కూడేరు మండలం ముద్దలాపురంలో ఈత పట్టలతో నిండిపోయిన అరటి తోట

గ్రానైట్, నల్లబండల పరిశ్రమలను కాపాడండి

● కార్మిక మంత్రికి పరిశ్రమల ప్రతినిధుల వినతి


ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డితో కలిసి మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాక్టరీల ప్రతినిధులు

తాడిపత్రి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): తాడిపత్రి ప్రాంతంలో ఉన్న గ్రానైట్, నల్లబండల పరిశ్రమల ఉనికిని కాపాడాలని కోరుతూ స్థానిక గ్రానైట్ పరిశ్రమల ప్రతినిధులు ఎమ్మెల్యే జేసీ అశ్మిత్ రెడ్డితో కలిసి బుధవారం విజయవాడలో పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేలాది మంది కార్మికులు బండల పరిశ్రమలను నమ్ముకొని జీవిస్తున్నారని తెలిపారు. అప్పట్లో యువగళం పాదయాత్రలో ప్రస్తుత మంత్రి నారా లోకేష్ పరిశ్రమలను కాపాడడానికి అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. విద్యుత్ చార్జీలు, రాయల్టీలు ఎక్కువగా ఉండడంతో ఫ్యాక్టరీలను నడపలేకపోతున్నట్లు వివరించారు. వాటిని తగ్గిస్తే మూతపడ్డ ఫ్యాక్టరీలకు ఊపిరిపోసినట్లు అవుతుందని విన్నవించారు. సమస్యల పరిష్కారంపై మంత్రి సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. అంతకుమునుపు ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డిని కలిసి పరిశ్రమల సమస్యలను వివరించామని, స్పందించిన ఆయన స్వయంగా పరిశ్రమలశాఖా మంత్రి వద్దకు తీసుకెళ్లారని వారు చెప్పారు.

ఉపాధి కూలీలకు పెండింగ్ బిల్లులు చెల్లించాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి సభ్యుడు రాంభూపాల్ డిమాండ్


ఎర్రంపల్లిలో పనులను పరిశీలిస్తున్న రాంభూపాల్

కళ్యాణదుర్గం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ డిమాండ్ చేశారు. మండలంలోని యాటకల్లు, ఎర్రంపల్లి, గరుడాపురం తదితర గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనులను బుధవారం ఆయన సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అచ్యుత్ ప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలకు కొన్ని వారాలుగా బిల్లులు ఇవ్వలేదని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వారాల తరబడి కూలి డబ్బులు ఇవ్వకపోతే కూలీల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. పనుల వద్ద కూలీలకు సరైన సదుపాయాలు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు స్పందించి కూలీలకు పెండిగ్ బిల్లులు ఇవ్వాలని, పనుల వద్ద కనీస సదుపాయాలు కల్పించాలని కోరారు. అలాగే ఒక్కో కూలీకి రోజుకు రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రంగనాథ్, రఘు, వంశీ, సోము, మూర్తి, శివ తదితరులు పాల్గొన్నారు.

కోడిగుడ్ల పరిశీలన

ఆంధ్రజ్యోతి స్పందన

కూడేరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పి. నారాయణపురం గ్రామంలో కోడి గుడ్లను అధికారులు పరిశీలించారు. అంగన్‌వాడీ కోడి గుడ్లలో పురుగులు ఉండడంపై ఆంధ్రజ్యోతిలో బుధవారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణమ్మ వెంటనే గ్రామానికి వచ్చి అంగన్‌వాడీ కేంద్రంలో కోడిగుడ్లను పరిశీలించారు. తర్వాత చెడిపోయిన రెండు గుడ్ల బదులు వేరే గుడ్లను పంపిణీ చేశారు.

భూ రీసర్వేకు రెండు గ్రామాల ఎంపిక

రాయదుర్గంరూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాపురం, ఆర్‌బీ వంక గ్రామాలను రీ సర్వే గ్రామాలుగా ఎంపిక చేసినట్లు తహసీల్దార్ నాగరాజు, మండల సర్వేయర్ మణికాంత్ బుధవారం ప్రకటనలో తెలిపారు.మల్లాపురం గ్రామంలో 8786.54 హెక్టార్ల భూ విస్తీర్ణం ఉందన్నారు. ఆర్‌బీవంక గ్రామంలో 6720.47 హెక్టార్లు చెప్పారు. ఈ రెండు గ్రామాలలో ఈ నెల 25వ తేదీ నుంచి రెండవ విడత భూరీసర్వే చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా ఐద్వా ఆవిర్భావ దినోత్సవం

గుంతకల్లుటౌన్, గుత్తి మార్చి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీఐటీయూ కాలనీలో బుధవారం ఐద్వా ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షురాలు బీ. జ్యోతి ఐద్వా జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకురాళ్లు షాకీరా, సుగుణ, సరస్వతి, అమృత బాయి తదితరులు పాల్గొన్నారు. అలాగే గుత్తి పట్టణంలోని దాసరికాలనీలో ఐద్వామహిళలు ఐద్వా జెండాను ఆవిష్కరించారు. మండల కార్యదర్శి రేణుకమ్మ, సభ్యులు పాల్గొన్నారు.

వైసీపీ ఆవిర్భావ దినోత్సవం

గుంతకల్లుటౌన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో బుధవారం పార్టీ 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వై వెంకటరామిరెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్‌ను కట్ చేసి అందరికీ పంచారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతి రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీఆర్ ఖలీల్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా కనకదాస విగ్రహ ప్రతిష్ఠ

ఉరవకొండ,మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని షెక్షానుపల్లిలో భక్త కనకదాస విగ్రహ ప్రతిష్ఠను బుధవారం ఘనంగా నిర్వహించారు. కురుబ కులస్థులు తొలుత కనకదాస విగ్రహాన్ని మేళతాళాలతో గ్రామంలో ఊరేగించారు. తర్వాత నూతనంగా నిర్మించిన మందిరంలో ప్రతిష్ఠించారు. ఆలుమత కుల గురువు రేవణ సిద్ధేశ్వర, పెద్దఎత్తున కురుబ కులస్థులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

శెట్టూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని ఏపీడీ రమేష్ నాయక్ సిబ్బందికి సూచించారు. మండలంలో పలు చోట్ల జరిగే ఉపాధి పనుల్ని బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రైతుల పొలాలలో ఫారంపాండ్ల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. ఏపీవో నీరజ, ఈసీ రమణ, టీఏ చిత్తరంజన్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై విచారణ

పుట్లూరు, మార్చి12(ఆంధ్రజ్యోతి): మండలంలోని మడ్డిపల్లి గ్రామానికి చెందిన నారపరెడ్డిపై నారాయణపల్లి గ్రామానికి చెందిన పర్వతాలు అనే వ్యక్తి ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టిన విషయం తెలిసిందే. దీంతో బుధవారం డీఎస్పీ వెంకటేశ్వర్లు, పుట్లూరు సీఐ సత్యబాబు, ఎస్ఐ వెంకటనరసింహం నారపరెడ్డిని కేసు విషయంలో పలు కోణాల్లో విచారించారు. కులంపేరుతో దూషించాడా లేదా అని గ్రామంలోని పలువురిని విచారించినట్లు తెలిసింది.

ఎస్సీ బాలుర హాస్టల్ తనిఖీ

పెద్దవడుగూరు, మార్చి12(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఎస్సీ సంక్షేమశాఖ డీడీ రాధిక బుధవారం తనిఖీ చేశారు. రాబోయే పరీక్షల్లో ప్రతి విద్యార్థి మంచి ఉత్తీర్ణ సాధించేందుకు తగు శిక్షణ ఇవ్వాలని వార్డెన్‌ను ఆదేశించారు..

వెన్నపూసపల్లిలో డీఎస్పీ విచారణ

యల్లనూరు, మార్చి12(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెన్నపూసపల్లి గ్రామంలో అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు బుధవారం విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన భాగ్యలక్ష్మి పార్థసారథిరెడ్డి, ప్రసాద్‌రెడ్డిల మధ్య భూ సమస్యలు ఉన్నాయి. భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు ప్రసాద్‌రెడ్డి , పార్థసారథిరెడ్డిలపై కేసు నమోదుచేశారు. ఈ కేసు విషయంలో ఇరువర్గాలను డీఎస్పీ విచారించారు.

ఘనంగా రేణుకాచార్య జయంతి

కణేకల్లు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వీరశైవుల ధర్మసంస్థాపకులు రేణుకాచార్య జయంతిని మండల కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రేణుకాచార్య చిత్రపటాన్ని వీరశైవ సంఘం నాయకులు ట్రాక్టర్‌లో కొలువుదీర్చి పురవీధులలో ఊరేగించారు.

మూడు పరీక్ష కేంద్రాల ఏర్పాటు

యాడికి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఈనెల 17నుంచి నిర్వహించనున్న పదవతరగతి పరీక్షలకు మండలకేంద్రంలో మూడు సెంటర్లను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ కాశప్ప బుధవారం ప్రకటనలో తెలిపారు. హైస్కూల్-ఏ, హైస్కూల్-బీ, వాగ్దేవి హైస్కూల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఆస్పత్రుల తనిఖీ

తాడిపత్రి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని యల్లనూరురోడ్డు, పుట్లూరు రోడ్డు తదితర ప్రాంతాల్లో ప్రైవేట్ ఆసుపత్రులు, ఆర్ఎంపీ డాక్టర్ల క్లినిక్‌లు, మెడికల్‌షాపులను డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు ఆసుపత్రులు సరిగా లేకపోవడంతో వాటి యాజమాన్యాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతి పూజ

శెట్టూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని యాటకల్లు గ్రామంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం సరస్వతీ దేవి పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హెచ్ఎం చంద్రమౌళి అధ్యక్షతన అర్చకుడు, విద్యార్థులు సరస్వతీదేవి చిత్రపటం వద్ద పూజలు చేశారు. ముఖ్యఅతిథులుగా ఎస్ఎంసీ చైర్మన్ జయరాములు, సర్పంచ్ ఈరన్న హాజరై పదో తరగతి పరీక్షలు బాగా రాయాలని విద్యార్థులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే చిన్నంపల్లి గ్రామంలోగల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోనూ సరస్వతీదేవి పూజను జరిపారు.

బెళుగుప్ప : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సరస్వతీపూజను ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ పెద్దన్న, ట్రైనీడీఎస్పీ అర్షద్ అలీ, ఎంపీడీఓ లక్ష్మీ నారాయణ, తహసీల్దార్ షర్మిల, ఎంఈఓ మల్లారెడ్డి, ఎస్ఐ శివ, డీటీ సురేఖ, హెచ్ఎం వెంకట ప్రసాద్, ఎస్ఎంసీ చైర్మన్ రుద్రయ్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తొలుత అందరూ సరస్వతీ దేవి చిత్రపటానికి పూజలు చేశారు. తర్వాత ముఖ్యఅతిథులు మాట్లాడుతూ టెన్త్ విద్యార్థులు పరీక్షలను ప్రశాంతంగా రాయాలని సూచించారు. ఒత్తిడికి గురికాకూడదని తెలిపారు. తర్వాత ఎంఈవో మల్లారెడ్డి 74 మంది విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. అలాగే పాఠశాలకు వందశాతం హాజరైన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

570 మార్కులు సాధించే వారికి విమాన ప్రయాణం

ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదో తరగతి పరీక్షలలో 570 మార్కులు సాధించే విద్యార్థులకు బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు విమానం ఎక్కిస్తానని ఎంఈఓ మల్లారెడ్డి ప్రకటించిన విషయం విధితమే. వారికి అయ్యే ప్రయాణ ఖర్చు తాను భరిస్తానంటూ ఎంపీపీ పెద్దన్న ఈ సందర్భంగా ముందుకొచ్చారు. ఒక్కొక్కరికి ప్రయాణ ఖర్చులు రూ. 5116లు ఇస్తానని తెలిపారు. పేద విద్యార్థులు విమానం ఎక్కవచ్చుననే పట్టుదలతో పరీక్షలు బాగా రాసే అవకాశం వుంటుందని వారు పేర్కొన్నారు.


యాటకల్లులో సరస్వతి పూజ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు


బెళుగుప్పలో ఎంఈఓ పంపిణీ చేసిన పరీక్ష సామగ్రితో విద్యార్థులు

గరుడ వాహనంపై చెన్నకేశవస్వామి


గరుడ వాహనంపై స్వామి, అమ్మవార్లు

యాడికి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శివలక్ష్మి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి వారు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో అర్చకులు మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి స్వామివారికి గరుడ వాహన సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి గరుడ వాహనంపై కొలువుదీర్చి గ్రామవీధుల గుండా ఊరేగించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు హరికృష్ణశర్మ, పవన్‌కుమార్‌శర్మ, బ్రహ్మోత్సవాల పర్యవేక్షకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు రాకూడదు

● స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జునుడు

యాడికి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా గ్రామాల్లో ఎక్కడా తాగునీటికి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పెషల్ డి ప్యూటీ కలెక్టర్, నియోజకవర్గ ప్రత్యేక అధికారి మల్లికార్జునుడు తెలిపారు. మండలకేంద్రంలోని సమావేశభవనంలో బుధవారం ఆయన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. వేసవి సమీపించిన నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. మండలంలోని ఏఏ గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందో వివరాలు ఆరాతీశారు. తర్వాత పీ4 సర్వేపై సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. ఎంపీడీఓ వీరరాజు, ఈఓపీఆర్‌డీ శశికళ, పంచాయతీ కార్యదర్శులు అశ్వర్థమనాయుడు, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

ముంపు భూముల పరిశీలన

యల్లనూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి):: మండలంలోని గడ్డంవారిపల్లి గ్రామంలో చెరువు సమీపంలోని ముంపు భూములను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నాగేంద్ర బుధవారం పరిశీలించారు. గడ్డంవారిపల్లి చెరువుకు సమీపంలో 86ఎకరాల భూమి వ్యవసాయానికి ఉపయోగమని ప్రభుత్వానికి విన్నవించుకున్నారు. ఈ భూములను ఆచప అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు, తహసీల్దార్ రాజాతో కలిసి పరిశీలించారు. అనంతరం గ్రామంలో ఎస్సీ కాలనీకి చెందిన శ్మశాన స్థలాన్ని పరిశీలించారు. తర్వాత మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను ఆర్డీఓ కేశవనాయుడు పరిశీలించారు.

దొంగల హల్‌చల్

కళ్యాణదుర్గంరూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పార్వతినగర్‌లో మంగళవారం రాత్రి రెండు గంటల సమయంలో దొంగలు చేతిలో కత్తులు పట్టుకుని హల్‌చల్ చేశారు. మీసేవా బాబు ఇంట్లో దొంగతనానికి విఫలయత్నం చేశారు. అక్కడ కుదరకపోవడంతో సమీపంలోని అనిల్ ఇంట్లోకి చొరబడి 45 గ్రాముల బంగారం, 1.70లక్షల నగదు, అదేకాలనీకు చెందిన శిల్ప ఇంట్లో బ్రాస్‌లెట్, ముదిగల్లు రోడ్డులోని బాలు, శ్రీకాంత్‌లకు చెందిన నాలుగు గొర్రెలను అపహరించారు. పట్టణ పోలీసులకు బాధితులు బుధవారం ఫిర్యాదు చేయడంతో వారు డాగ్స్ స్క్వాడ్‌తో తనిఖీ నిర్వహించారు.

70 మామిడి చెట్ల దగ్ధం

బ్రహ్మసముద్రం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేపులపర్తి గ్రామంలో రామదాసు భార్య వెంకటమ్మకు చెందిన పొలంలో 70 మామిడి చెట్లు దగ్ధమయ్యాయి. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి నిప్పుపెట్టారని, దీంతో కాపునకు వచ్చి 70 చెట్లు కాలిపోయాయని, బాధితురాలు బుధవారం వాపోయారు. సుమారు రూ.1.50 లక్షల మేర నష్టం జరిగినట్లు చెప్పారు. వేపులపర్తి వీఆర్వో మల్లికార్జున, ఉద్యానవన శాఖాధికారి ముజఫర్ కాలిపోయిన చెట్లను పరిశీలిచారు.

సూర్యఘర్‌పై అవగాహన

బొమ్మనహాళ్, మార్చి12(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు గ్రామాన్ని ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దాలని సీఎం చంద్రబాబు ఇటీవల పర్యటనకు వచ్చినప్పుడు ఆదేశాలు ఇచ్చారని, అందులోభాగంగా గ్రామంలో ఇంటింటికీ సోలార్ ఏర్పాటు చేయాలని సంకల్పించామని విద్యుత్ ఈఈ రాజశేఖర్ తెలిపారు. గ్రామంలో బుధవారం ఆయన సూర్యఘర్ సోలార్ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి ఇంటికి సోలార్ విద్యుత్ ఉండాలని చెప్పారు. పర్యావరణానికి హాని చేయని సౌరశక్తి వాడకాన్ని ప్రజలు అలవాటు చేసుకోవాలని సూచించారు. కళ్యాణదుర్గం డీఈఈ శ్రీనివాసనాయుడు, సర్పంచ్ పరమేష్, కమర్షియల్ ఏడీ రామకృష్ణ, ఏఈ లక్ష్మీరెడ్డి, మాజీ సర్పంచ్ హనుమంతరెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు స్థల పరిశీలన

బొమ్మనహాళ్, మార్చి12(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు గ్రామంలో గురుకుల పాఠశాల, కుటీర పరిశ్రమల ఏర్పాటుకు కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబు బుధవారం స్థల పరిశీలన చేశారు. గ్రామశివారులోని 348 సర్వే నెంబర్‌లో 52 ఎకరాలు భూమిని పరిశీలించారు. ఈ సంద్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఇటీవల గ్రామ పర్యటనకు వచ్చి ఇక్కడ గురుకుల పాఠశాల, కుటీర పరిశ్రమలు ఏర్పాటుకు హామీ ఇచ్చారన్నారు. ఈ నేపథ్యంలో గురుకుల పాఠశాల నిర్మాణానికి నాలుగు ఎకరాలు, కుటీర పరిశ్రమలు నిర్మాణాలకు 52 ఎకరాల భూమిని పరిశీలించినట్లు తెలిపారు. తహసీల్దార్ మునివేలు, సర్వేయర్ రవితేజ, వీఆర్వో నరసింహులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలకు కృషి

రాయదుర్గం రూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కమ్యూనిటీ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తామని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఆస్పత్రిలో బుధవారం అభివృద్ధి కమిటీ సభ్యులు సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఆదేశాల మేరకు ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలే లక్ష్యంగా ముందుకెళతామని తెలిపారు. ప్రతి రోగికి సౌకర్యవంతమైన వాతావరణంలో ఆరోగ్యసేవలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఆసుపత్రిలో సమస్యలను దశలవారీగా నెరవేరుస్తామన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ మేర్సీ జ్ఞానసుధ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పోగునూరు కళ్యాణ్‌చక్రవర్తి, కొండాపురం శ్రీనివాసులు, జయంతి సురేష్, సంపత్‌కుమార్‌తోపాటు ఆసుపత్రి అభివృద్ధి సలహా మండలి సభ్యులు పేర్కొన్నారు.